నేటి దినపత్రిక
సూర్య
ఆదివారం
21 జనవరి
2024
పేజీలు 11
అమరావతి
గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్

### ఫైనాన్స్ సంస్థల

# టెర్రర్ రికవరీ





2 లో

- శృతిమించిన ఫైనాన్స్ రికవరీ ఏజెంట్ల ఆగడాలు
- రికవరీ ఏజెంట్ల అవతారం ఎత్తుతున్న రౌడీ షీటర్లు, గంజాయి బ్యాచ్
- నియమ నిబంధనలు వుండవు హడలెత్తించడమే లక్ష్యం
- వేళా పాళా లేకుండ ఫోన్లు చేసి బెదిరింపులు, దూషణల పర్వం
- ఇళ్ళ దగ్గర, రోడ్ల పై ఎక్కడ పడితే అక్కడ రచ్చ చేస్తూ పరువు తీస్తున్న వైనం
- ఫోటోలు మార్ఫింగ్ చేసి నగ్న చిత్రాలను షేర్ చేసిన ఘటనలు
- రికవరీ ఏజంట్ల బెదిరింపులు తాళలేక రుణగ్రహీతల బలవన్మరణాలు
- బాధితుల ఫిర్యాదులను బుట్టదాఖలు చేస్తున్న అధికారుల తీరు
- సుప్రీంకోర్టు జడ్జిమెంట్లు, ఆర్ బి ఐ నిబంధనల పై కనీస అవగాహన లేని పోలీసులు



### కళాకారుల జీవితాల్లో

# కాంతులు

- రాష్ట్రవ్యాప్తంగా కళాకారులకు గుర్తింపు కార్డుల ప్రదానోత్సవం
- 4 వేల మంది కళాకారులకు గుర్తింపు కార్డులు
- గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా పారదర్శకంగా గుర్తింపు కార్డుల జారీ
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్యక్రమాలు, రాయితీల్లో గుర్తింపు కార్డు పొందిన కళాకారులకు ప్రాధాన్యం
- "కళలను బ్రతికించాలి.. కళాకారులను బ్రతికించుకోవాలి" ఇదే మన ప్రభుత్వ లక్ష్యం
- పర్యాటక, సాంస్కృతిక, యువజనాభివృద్ధి శాఖామాత్యులు ఆర్.కె. రోజా

వివరాలు 2లో

# టీడీపీకి మరోసారి గుణపాఠం తప్పదు



ప్రజలు ఓట్లతోనే సమాధానం చెబుతారు

గుంటూరు పశ్చిమంలో చరిత్ర తిరగరాస్తాం

జగనన్న నాయకత్వంలో గుంటూరును గొప్ప నగరంగా మారుస్తాం

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** టీడీపీకి మరోసారి గుణపాఠం తప్పదని, ప్రజలు ఓట్లతోనే సమాధానం మిగతా 3లో...

# ఫైనాన్స్ సంస్థల టెర్రర్ రికవరీ..!

**శృతిమించిన ఫైనాన్స్ రికవరీ ఏజెంట్ల ఆగడాలు**

**రికవరీ ఏజెంట్ల అవతారం ఎత్తుతున్న రౌడీ షీటర్లు, గంజాయి బ్యాచ్**

**నియమ నిబంధనలు వుండవు హడలెత్తించడమే లక్ష్యం**

**వేళా పాళా లేకుండ ఫోన్లు చేసి బెదిరింపులు, దూషణల పర్వం**

**ఇళ్ళ దగ్గర, రోడ్ల పై ఎక్కడ పడితే అక్కడ రచ్చ చేస్తూ పరువు తీస్తున్న వైనం**

**ఫోటోలు మార్ఫింగ్ చేసి నగ్న చిత్రాలను షేర్ చేసిన ఘటనలు**

**రికవరీ ఏజంట్ల బెదిరింపులు తాళలేక రుణగ్రహీతల బలవన్మరణాలు**

**బాధితుల ఫిర్యాదులను బుట్టదాఖలు చేస్తున్న అధికారుల తీరు**

**సుప్రీంకోర్టు జడ్జిమెంట్లు, ఆర్‌బీఐ నిబంధనలపై కనీస అవగాహన లేని పోలీసులు**

**ఫైనాన్స్ సంస్థల రికవరీ ఏజెంట్ల ఆగడాలు మితిమీరుతున్నాయి. పేరుమోసిన రౌడీ షీటర్లు, గంజాయి బ్యాచ్, ఆకతాయిలు రికవరీ ఏజెంట్ల అవతారం ఎత్తుతున్నారు. వేళా పాళా లేకుండా ఫోన్లు చేసి బెంబేలెత్తిస్తున్నారు. ఇళ్ళు, రోడ్లు అన్న తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ రచ్చ చేస్తూ హడలెత్తిస్తున్నారు. కనీసం గుర్తింపు కార్డులు కూడా లేకుండా రికవరీ లిస్టు అంటూ ఒక పేపర్ చేత పట్టుకొని నానా యాగీ చేస్తున్నారు. అల్లరి మూకల్ని వెంటబెట్టుకుని బెదిరింపులు, దూషణలకు దిగుతున్నారు. ఫోటోలు మార్ఫింగ్ చేసి నగ్న చిత్రాలను షేర్ చేసిన ఘటనలు ఉన్నాయి. పరువు పోయి, బెదిరింపులకు తాళలేక బాధితులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఫైనాన్స్ సంస్థలకు అంతా రాసిచ్చారుగా.. వారికి రికవరీ హక్కు వుంటుందని బాధితులకు పోలీసుల నుండి వస్తున్న సమాధానం. ఆర్బీఐ నిబంధనలు, సుప్రీం కోర్టు తీర్పుల పై కనీస అవగాహన లేకుండా రికవరీ ఏజంట్ల పై ఉదాసీనంగా వ్యవహరిస్తున్న పోలీసుల తీరు శోచనీయం.**

**దుగ్గిరాల మండలం పెనుమూలి గ్రామానికి చెందిన కట్టా వెంకటేశ్వర్లు ఓ ఫైనాన్స్ సంస్థలో మూడు ఏళ్ల క్రితం రూ.లక్ష పర్సన్ లోన్ తీసుకున్నారు. సవ్యంగా చెల్లిస్తుండగా బాకీ తీరేందుకు రూ.26 వేలు మాత్రమే మిగిలి ఉంది. అనారోగ్య కారణాలతో లోన్ చెల్లింపులో కొంత జాప్యం జరిగింది. ఇక ఫైనాన్స్ సంస్థ తరుపున రోజుకొక రికవరీ ఏజెంట్ ఫోన్ చేసి బెదిరించడంతో వెంకటేశ్వర్లుకు పక్షవాతం వచ్చింది.ఈ క్రమంలో ఫైనాన్స్ సంస్థ రికవరీ ఏజెంట్ పేరుతో వినుకొండ ప్రసాద రావు అలియాస్ హసన్ అనే వ్యక్తి లోన్ వన్ టైమ్ సెటిల్మెంట్ చేస్తాను అంటూ వెంకటేశ్వర్లు నుండి రూ.10వేలు కట్టించు కున్నాడు. తిరిగి రెండు నెలలు గడిచాక రూ. 25 వేలు లోన్ చెల్లించాలని వెంకటేశ్వర్లుకు ఫైనాన్స్ సంస్థ నుండి డిమాండ్ నోటీసు వచ్చింది. ఖంగుతిన్న వెంకటేశ్వర్లు ఫైనాన్స్ సంస్థ మేనేజర్ ని సంప్రదించి వన్ టైమ్ శెట్టిల్మెంట్ కింద రూ. 10 వేలు చెల్లించిన విషయం చెప్పారు. అయితే మీరు నగదు చెల్లించిన రికవరీ ఏజెంట్‌తో మాకు సంబంధం లేదని బ్యాలెన్స్ అమౌంట్ సంస్థకు కట్టాల్సిందే అని వెంకటేశ్వర్లు పై సదరు మేనేజర్ ఒత్తిడి చేయడంతో పంచాయతీ అరండల్‌పేట ఠాణాకు, తదుపరి ఫైనాన్స్ సంస్థకు లీగల్ నోటీసుల వరకు వెళ్ళింది.**

**గుంటూరులోని ఐద్వా నగర్‌కు చెందిన చిట్టిపోతుల వెంకటేశ్వరరావు ఇదే సంస్థ నుండి ఫైనాన్స్ తీసుకొని హీరో గ్లామర్ ద్విచక్రవాహనాన్ని 2023 జూన్ నెలలో కొనుగోలు చేశారు. మూడు కిస్తీలు సవ్యంగానే చెల్లించారు. నాల్గో కిస్తీ కట్టేందుకు కొద్ది రోజులు జాప్యం జరిగింది. ఇదే అదునుగా వెంకటేశ్వరరావు పని చేస్తున్న చోటకి రికవరీ ఏజెంట్ల పేరుతో మూడు మోటారు సైకిళ్ల పై ఆరుగురు వ్యక్తులు వచ్చి తాళం వేసి వున్న హీరో గ్లామర్ ద్విచక్రవాహనాన్నీ ఆటోలో ఎక్కించుకుని తీసుకెళ్లారు. రికవరీ పేరుతో వచ్చిన వ్యక్తులు నోటీసులు ఇవ్వడం గానీ, ఐడీ కార్డులు చూపడం గానీ చేయకపోవడంతో రికవరీ పేరుతో వచ్చిన వాళ్ళు దొంగలేమోనని వెంకటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు.**

**గుంటూరు మేజర్ న్యూస్ :** క్రెడిట్ కార్డు బిల్లు చెల్లించలేదనో, వాహనం కిస్తీలు కట్టలేదనో, పర్సనల్ లోన్ ఈ ఎం ఐ బాకీ వుందనో ఆయా ఫైనాన్స్ సంస్థల నుండి రికవరీ కోసం వచ్చే ఏజంట్ల ఆగడాలు శృతిమించుతున్నాయి. పెరిగిన ధరలు, ఖర్చుల ధాటికి ప్రస్తుత కాలంలో మధ్యతరగతి ప్రజలు అప్పు తీసుకోకుండా కుటుంబం గడవని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా పర్సనల్ లోన్లు, పిల్లల చదువు కోసం తీసుకున్న లోన్లు, వాహనాలు, గృహం కోసం తీసుకున్న రుణాలకు ఈఎంఐలు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఈ రుణ ఈఎంఐలు సకాలంలో చెల్లిస్తే పర్లేదు కానీ ఏమైనా కొంచెం ఆలస్యమైతే లోన్ రికవరీ ఏజెంట్లు ఇల్లు,ఆఫీసు, రోడ్డు అనే తేడా లేకుండా వచ్చి రచ్చ చేస్తారు. ఏ సమయం లోనైనా వచ్చి గొడవ చేయడం, వేళాపాళా లేకుండా ఫోన్లు చేసి విసిగిస్తూ ఉంటారు. రుణగ్రహీతలను, వారి కుటుంబాలను అవమానించడం, బెదిరింపులు, మానసిక, శారీరక వేధింపులకు గురిచేసి డబ్బును తిరిగి పొందేందుకు ప్రయత్నిస్తుంటారు. ఈ క్రమంలో రికవరీ ఏజెంట్ల బెదిరింపులు తాళ లేక, పరువు బజారున పడిందని అనేకమంది ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు వున్నాయి. లోన్ తీసుకున్న పాపానికి రుణగ్రహీతలు రికవరీ ఏజెంట్ల దెబ్బకి బాధితులుగా మారుతున్నారు.



తెలిసో, తెలియకో కొన్ని లోన్ యాప్స్ డౌన్ లోడ్ చేసుకుని రుణాలు తీసుకుంటున్నారు. రుణం తీసుకున్న పాపానికి లోన్ తీసుకున్న వారి ఫోటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో షేర్ చేస్తామని బ్లాక్ మెయిల్ చేస్తుంటారు. ఇష్టమొచ్చినట్టు వడ్డీ వేస్తూ రుణగ్రహీతలు నడ్డి విరగ్గొడతారు. దారుణంగా వడ్డీలు వేసి బలవంతపు వసూళ్ళకు దిగుతున్నారు. వసూళ్లు చేసే క్రమంలో టార్చర్ చేస్తారు. రుణగ్రహీతల సోషల్ మీడియా ఖాతాలో ఉన్న వారి నంబర్స్ కి కాల్ చేసి పరువు తీసేస్తారు. రుణగ్రహీతల ఫోన్ నంబర్ హిస్టరీ తీసుకుని అందులో ఉన్న కాంటాక్ట్‌లకి కాల్ చేసి లోన్ కట్టడం లేదని పరువుని బజారుకీడుస్తారు. లోన్ కట్టకపోవడం తప్పే. కానీ లోన్ కట్టలేదని పరువు తీయడం కరెక్ట్ కాదన్న వాదనలు ఉన్నాయి. లోన్ యాప్‌ల పుణ్యమా అని మార్ఫింగ్ ఫోటోలు, మార్ఫింగ్ వీడియోలు అశ్లీల వెబ్ సైట్స్‌లో అప్లోడ్ చేస్తామని బెదిరించడంతో ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న ఘటనలు అనేకం.

రికవరీ ఏజెంట్ల ఆగడాలకు అడ్డుకట్ట వేసేలా భారతీయ రిజర్వ్ బ్యాంకు కఠినమైన మార్గదర్శకాలను తప్పనిసరి చేసింది. రికవరీ ఏజెంట్లు రుణగ్రహీతలను ఒత్తిడికి గురి చేయడం, దుర్భాషలాడటం, శారీరకంగా గాయపరచడం వంటివి చేయడం నేరమని ఆర్బీఐ స్పష్టం చేసింది. లోన్ తీసుకున్న వ్యక్తుల వ్యక్తి గత స్వేచ్ఛకు ఎలాంటి భంగం కలిగించకూడదని ప్రయివేట్ ఫైనాన్స్ సంస్థలకు, బ్యాంకులకు ఆర్బీఐ కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. రుణగ్రహీతలకి ఫోన్లు, సోషల్ మీడియా ద్వారా తప్పుడు మెసేజులు పంపించకూడదని ఆర్బీఐ వెల్లడించింది. మరీ ముఖ్యంగా రుణగ్రహీతలను బెదిరించకూడదని, ఉదయం 9 గంటల లోపు, రాత్రి 6 గంటల తర్వాత వారి ఇళ్లకు వెళ్లకూడదని ఆర్బీఐ తెలిపింది. అయినా కూడా రికవరీ ఏజెంట్లు వేధింపులకు గురి చేస్తే కనుక వారిపై ఫిర్యాదు చేయవచ్చు. ఆధారాల కోసం రికవరీ ఏజెంట్ల కాల్ డేటా, ఈమెయిల్స్, ఎస్ఎంఎస్, చాట్ మెసేజులు వంటివి భద్రపరచుకోవాలి. వీటి సాయంతో బ్లాక్ మెయిల్ చేసే రికవరీ ఏజెంట్ల మీద ఫిర్యాదు చేయవచ్చు.

రికవరీ ఏజెంట్ల వేధింపుల నుంచి తక్షణమే ఉపశమనం పొందాలంటే సమీప పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయవచ్చు. ఒకవేళ పోలీసులు కంప్లైంట్ తీసుకోకపోతే కనుక కోర్టును ఆశ్రయించవచ్చు. ఫైనాన్స్ సంస్థల మేనేజర్లను సంప్రదించి రికవరీ ఏజెంట్ల వేధింపులను నిలువరించమని చెప్పవచ్చు. అప్పటికీ రికవరీ ఏజెంట్లు వేధింపులకు గురి చేయడం మానకపోతే ఈ-మెయిల్ ద్వారా ఆర్బీఐకి ఫిర్యాదు చేయవచ్చు. లోన్ తీసుకున్న వారికి ఎదురైన పరిస్థితులను ఈమెయిల్ లో పేర్కొనాలి. ఇలా చేయడం వల్ల నిబంధనల ఉల్లంఘన కింద వేధిస్తున్న రికవరీ ఏజెంట్లను ఆర్బీఐ నిషేధించే ఛాన్స్ ఉంటుంది. నిబంధనల ఉల్లంఘనలు మరీ తీవ్రంగా ఉన్నట్లు తేలితే వారిపై నిషేధాన్ని పొడిగించే అవకాశం కూడా ఉంది. రికవరీ ఏజెంట్లు లోన్ తీసుకున్న వారి ఇంటికి గానీ, ఆఫీసుకు గానీ వచ్చి అందరి ముందు కించపరిచినా, అవమానపరిచినా, దూషించినా, గౌరవానికి భంగం కలిగించినా రుణ గ్రహీతలు బ్యాంకు వారిపై, రికవరీ ఏజెంట్లపై పరువు నష్టం దావా వేయవచ్చు. అయితే వీటిని ఎవరూ పాటించకపోవడంతో రికవరీ ఏజెంట్లు రెచ్చిపోతున్నారు. ఆర్థిక పరిస్థితి బాగోలేక లోన్ కట్టలేని పరిస్థితిలో రుణగ్రహీతలని టార్చర్ చేయడం సరికాదని ఇప్పటికే పలువురు న్యాయవాదులు, ఆర్టీఐ యాక్టివిస్టులు గొంతు వినిపించారు. ఇలాంటి విషయాల్లో రుణగ్రహీతలు భయపడొద్దని, ధైర్యంగా పోరాడాలని ఆర్టీఐ యాక్టివిస్ట్, ప్రముఖ న్యాయవాది మొగిలి వెంకటేశ్వర్లు బాధితులకు భరోసానిస్తున్నారు.

ప్రస్తుత పరిస్థితుల్లో మధ్యతరగతి ప్రజలు తమ దైనందిక అవసరాల కోసం వివిధ ప్రయివేటు ఫైనాన్స్ సంస్థలు, బ్యాంకుల నుండి రుణాలు తీసుకుంటున్నారు. అయితే రుణాల చెల్లింపులో జాప్యం జరిగితే ఆయా ఫైనాన్స్ సంస్థల నుండి రికవరీ ఏజెంట్ల పేరుతో వచ్చే వారితో రుణగ్రహీతలు హడలెత్తిపోతున్నారు.రికవరీ ఏజెంట్లు వేళా పాళా లేకుండా ఫోన్లు చేసి బెదిరిస్తున్నారని, ఇళ్ల దగ్గరకు వచ్చి నానా యాగీ చేస్తున్నారని రుణగ్రహీతలు అనేకమంది నా దృష్టికి తెచ్చారు. అయితే రికవరీ ఏజెంట్ల బెదిరింపులకు భయపడవద్దని, ఆర్బీఐ నిబంధనలు పాటించని రికవరీ ఏజెంట్ల పై చర్యలు తీసుకునే అవకాశం వుందని బాధితులకు మనవి చేస్తున్నాను. ఆర్బీఐ నిబంధనల ప్రకారం బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థలు, ప్రయివేటు ఫైనాన్స్ సంస్థలు ఆర్బీఐ గుర్తింపు వున్న రికవరీ ఏజెన్సీలను మాత్రమే నియమించుకోవాలి. రికవరీ ఏజెన్సీల్లోని ఏజెంట్లకు ఐ ఐ బి ఎఫ్ (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్) ట్రైనింగ్ సర్టిఫికెట్ తప్పనిసరిగా వుండాలి. రికవరీ ఏజెంట్లకు పోలీసుల ఎన్ ఓ సి తప్పనిసరిగా ఉండాలి. రికవరీకి వెళ్లే సమాచారాన్ని సంబంధిత పోలీసులకు తెలియపర్చాలి. రికవరీ ఏజెంట్ల వ్యవహార శైలి పై పోలీసులు నిఘావుంచి ఏడాది ఒకసారి కాండాక్ట్ రిపోర్టు తయారు చేయాలి. రికవరీ ఏజెంట్లకు ఐ డి కార్డులు వుండాలి. ఈ ఐడి కార్డులను పోలీసుల విచారణ తర్వాతే ఇవ్వాలి. ఏజెంట్లు రుణగ్రహీతల పట్ల అసభ్యంగా, అవమానకరంగా, బల ప్రయోగం వంటివి చేయకూడదు. రుణగ్రహీతలను ఉదయం 9 గం,ల నుండి సాయంత్రం 6 గం,ల మధ్యలో మాత్రమే కాంటాక్టు చేయాలి.ఏజెంట్లు రికవరీ కోసం ఇళ్లకు వెళ్లకూడదు. వెళితే కోర్టు ధిక్కారం, ఐ పి సి కింద నేరం అవుతుంది. ఇళ్ళు,ఆఫీసుల దగ్గరకు వచ్చి రికవరీ ఏజెంట్లు గొడవ చేస్తే సంబంధిత పోలీసు స్టేషన్ లో బాధితులు ఫిర్యాదు చేయొచ్చు. ఇది కాగ్నిజబుల్ అఫెన్స్ ( పట్టదగిన నేరం) కిందకు వస్తుంది. దీనిపై పోలీసులు 154 సిఆర్పీసీ కింద రికవరీ ఏజెంట్ల పై కేసులు నమోదు చేయాలి. రికవరీ ఏజెంట్లు వాహనాలు సీజ్ చేయాలి అంటే ఇద్దరు సాక్షుల సమక్షంలో పంచనామా చేయాలి. పంచనామా కాపీని తదుపరి సమాచారం కోసం సంబంధిత పోలీసులకు అందించాలి. రికవరీ ఏజెంట్లు, ఏజెన్సీలు ఆర్ బి ఐ నిబంధనలు, సుప్రీంకోర్టు తీర్పులకు అనుగుణంగా వ్యవహరించాల్సి వుంటుంది. నిబంధనలు పాటించని రికవరీ ఏజెంట్ల పై బాధితులు ఫిర్యాదులు చేస్తే తప్పకుండా న్యాయం లభిస్తుంది. గుంటూరులో శ్రీరాం ఫైనాన్స్ రికవరీ ఏజెంట్ల ఆగడాలు హద్దు మీరాయి. దుగ్గిరాల మండలం పెనుమూలికి చెందిన కట్టా వెంకటేశ్వర్లు, గుంటూరుకు నివాసి చిట్టిపోతుల వెంకటేశ్వరరావు ఇద్దరూ గిరిజన బిడ్డలే. వీళ్లను శ్రీరాం ఫైనాన్స్ రికవరీ ఏజెంట్లు ఆర్బీఐ రూల్స్ పాటించకుండా ఇబ్బందులకు గురిచేశారు. రికవరీ ఏజెంట్లు, మేనేజర్ పై కేసులు నమోదుకు ఆయా పోలీస్టేషన్లలో ఫిర్యాదులు ఇచ్చాం. ఐపీసీ సెక్షన్ల కింద లీగల్ నోటీసులు జారీ చేశాను.



**ఎం. వెంకటేశ్వర్లు**
ఎంఏ, ఎల్ ఎల్ బి
అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (రిటైర్డ్), అడ్వకేట్
(ఏపీ హైకోర్టు)

# కళాకారుల జీవితాల్లో కాంతులు



**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** సాంస్కృతిక సంబరాల్లో గుర్తించిన కళాకారులకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకున్నామని, అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా కళాకారులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్నామని పర్యాటక, సాంస్కృతిక, యువజనాభివృద్ధి శాఖామాత్యులు ఆర్.కె. రోజా అన్నారు. రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి (భాషా సాంస్కృతిక శాఖ) ఆధ్వర్యంలో శనివారం విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో కళాకారులకు గుర్తింపు కార్డుల ప్రదానోత్సవం అట్టహాసంగా నిర్వహించగా మంత్రి రోజా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి క్రియేటివ్ హెడ్ యల్. జోగి నాయుడు, రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి చైర్ పర్సన్ వంగపండు ఉష, దృశ్య కళల అకాడమీ చైర్ పర్సన్ కె. సత్య శైలజ, సాహిత్య అకాడమీ చైర్ పర్సన్ శ్రీలక్ష్మి, సంగీత నృత్య అకాడమీ చైర్ పర్సన్ పి.శిరీష, సైన్స్, టెక్నాలజీ అకాడమీ చైర్ పర్సన్ టి.ప్రభావతి, అధికార భాషా సంఘం సభ్యులు మస్తానమ్మ, రాష్ట్ర సాంస్కృతిక శాఖ సీఈవో మల్లిఖార్జునరావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ.. తోటి కళాకారులందరికీ గుర్తింపుకార్డుల పంపిణీ కార్యక్రమంలో ఓ మంత్రిగా పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. నవరత్నాలు పథకాల ద్వారా కళాకారులకు మన రాష్ట్ర ప్రభుత్వం ఎంతో మేలు చేకూర్చిందన్నారు. రాష్ట్రం విడిపోయాక కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వలేదని, గుర్తింపు కార్డులు లేక కళాకారులు చాలా ఇబ్బందులు పడ్డారని వెల్లడించారు. కళాకారుల డేటా తీసుకోకపోవడం వల్ల కళాకారులకు తగిన న్యాయం జరగలేదన్నారు. కానీ అధికారం చేపట్టిన నాటి నుండి ముఖ్య మంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి కళాకారులకు అండగా నిలబడ్డారన్నారు. అందుకే తనకు మంత్రిగా అవకాశం కల్పించారని తెలిపారు. తాను పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత కళాకారుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేశానన్నారు. కళాకారుల వినతిపత్రాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరుగుతోందని స్పష్టం చేశారు. సాంస్కృతిక సంబరాల్లో కళాకారుల డేటా సేకరణ ద్వారా నిజమైన కళాకారులను గుర్తించామన్నారు. కార్యక్రమ అనంతరం రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన వివిధ రంగాలకు చెందిన 4వేల మంది కళాకారులకు గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు, గీతాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

# జగన్ కాదు చంద్రబాబే దళిత ద్రోహి

## వైఎస్సార్సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుర్రం బసవయ్య



**అవనిగడ్డ, మేజర్ న్యూస్:** విజయవాడలో దేశం మొత్తం గర్వపడేలా భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం ఏర్పాటు చేసిన సీఎం జగన్మోహన్ రెడ్డి దళితద్రోహి కాదని, దళితుల్లో ఎవరు పుట్టాలని కోరుకుంటారు అన్న చంద్రబాబే దళితద్రోహి అని వైఎస్సార్సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు గుర్రం బసవయ్య అన్నారు. స్థానిక వైఎస్సార్సీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ దేశం మొత్తం గర్వపడేలా విజయవాడలో అంబేద్కర్ మహాశిల్పంను ఏర్పాటు చేసిన సీఎం జగన్మోహన్ రెడ్డిని టీడీపీ నేతలు దళిత ద్రోహి అని విమర్శించడం సిగ్గుచేటన్నారు. దళితుల్లో పుట్టాలని ఎవరు కోరుకుంటారని పేర్కొన్న చంద్రబాబు. దళితులకు రాజకీయాలు ఎందుకని హేళనగా మాట్లాడిన చింతమనేని ప్రభాకర్ దళితద్రోహులు అని బసవయ్య అన్నారు. అమరావతిలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు కోసం స్థలం కొన్నామని గొప్పలు చెప్పుకునే చంద్రబాబు ఆ స్థలం ఎక్కడుందో మీ పార్టీ నాయకులకైనా చూపించాలని బసవయ్య హితవు పలికారు.ఎస్సీలకు 50 శాతం నామినేటెడ్ పదవులు కేటాయించిన సీఎం జగన్మోహన్రెడ్డి కి దళితులు రుణపడి ఉంటారని చెప్పారు. ఇంతవరకూ ఎస్సీలకు కేటాయించని దివి మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవిని తొలిసారిగా దళితుడైన తనకు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. కిరాయిహంతకులు, భార్యా భర్తల మధ్య తగవులు పెట్టి సెటిల్మెంట్స్ చేసే కుహానా నాయకులు సీఎం జగన్మోహన్ రెడ్డిని విమర్శించడం సిగ్గుచేటన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల అభ్యున్నతి కోసం సీఎం జగన్మోహన్ రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని చెప్పారు. అవనిగడ్డ సర్పంచ్ గొరుముచ్చు ఉమా మాట్లాడుతూ స్టాట్యూ ఆఫ్ లిబర్టీ అమెరికాకు ఎంత గుర్తింపు తీసుకొచ్చిందో మన దేశానికి విజయవాడలో ఏర్పాటు చేసిన స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్ అంతే గుర్తింపు తీసుకురానుందని చెప్పారు. సీఎం జగన్మోహన్ రెడ్డి అన్ని రంగాల్లో మహిళలకు పెద్దపీట వేస్తున్నారని అన్నారు. సీఎంకు వస్తున్న పేరు ప్రతిష్టలు తట్టుకోలేని ప్రతిపక్ష నాయకులు చౌకబారు విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయకుమార్,మాజీ సర్పంచ్ నలుకుర్తి పృధ్వీరాజ్, ఎస్సీసెల్ నాయకులు వెన్నా ప్రసాద్ పాల్గొన్నారు.



## అంగన్వాడీలకు మద్దతుగా ప్రజాసంఘాల రాస్తారోకో

**గుడివాడ, మేజర్ న్యూస్:** సమస్యల పరిష్కారానికి 40రోజులుగా ఆందోళన చేస్తున్న అంగన్వాడీలపై ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ, ఏఐటీయూసీ అధ్వర్యంలో ప్రజా సంఘాల నాయకులు గుడివాడలో శనివారం నిరసన వ్యక్తం చేశారు. గుడివాడ – విజయవాడ రహదారిలో ఫ్లైఓవర్ బ్రిడ్జి రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆర్సీపీ రెడ్డి, ప్రకాష్ బాబు, బీవీ శ్రీనివాస్, సత్యన్నారాయణ, లక్ష్మణరావు, రజని మాట్లాడుతూ ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి అంగన్వాడీ కార్యకర్తల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ వైఖరిని నిరశిస్తూ పెద్దపెట్టున నినాదాలు ఇచ్చారు. దీంతో ఇరువైపులా వాహనాలు బారులు తీరినిలిచిపోవడంతో ఆందోళనను విరమించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఆందోళనకారులు వినకపోవడంతో అరెస్టుచేసి స్టేషనుకు తరలించారు.

## టీడీపీకి మరోసారి గుణపాఠం తప్పదు

(మొదటిపేజీ తరువాయి)

చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 28వ వార్డు సీతమ్మ కాలనీ, అంకమ్మ తల్లి గుడి దగ్గరి నుంచి శనివారం సాయంత్రం మనతో మన రజినమ్మ కార్యక్రమాన్ని పండుగ వాతావరణం నడుమ నిర్వహించారు. కార్యక్రమం ఆద్యంతం ప్రజలు బ్రహ్మరథం పట్టారు. వైఎస్ జగన్ నినాదాలతో ప్రజలు హోరెత్తించారు. డీజే మోతలు, తీన్మార్, బాణ సంచా పేలుళ్లతో పండుగ వాతావరణం నెలకొంది. దారిపొడవునా పూల వర్షం కురిసింది. ప్రజల నుంచి అపూర్వస్పందన లభించింది. 28వ డివిజన్లోని అన్ని వీధుల్లో మంత్రి కలియతిరిగారు. స్థానిక ప్రజలతో మమేకయ్యారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న కొద్ది చంద్రబాబునాయుడు చేసే కుట్రలు, కుతంత్రాలు ఏ స్థాయిలో ఉంటాయో ప్రజలందరికీ తెలుసని పేర్కొన్నారు. తెలుగుదేశంపార్టీకి అధికారంలో ఉన్నన్ని రోజులు ప్రజలే గుర్తురారని, ఎన్నికలు సమీపిస్తున్నకొద్ది ప్రజలపై కపట ప్రేమను చూపిస్తున్నారని మండిపడ్డారు.

### చరిత్ర ఎరుగని గొప్ప పాలన అందిస్తున్నాం

గతంలో ఏ ప్రభుత్వానికి సాధ్యం కానివిధంగా గొప్ప గొప్ప కార్యక్రమాలతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంచలనాత్మక పరిపాలనను కొనసాగిస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. సచివాలయాల ఏర్పాటు, ఇంటింటికీ ప్రభుత్వ సేవలు, ఇంటింటికీ వైద్య సేవలు.. ఇలా ఎన్నో సంస్కరణలను పరిపాలనలో తీసుకొచ్చి జగనన్న రికార్డు సృష్టించారని పేర్కొన్నారు. సామాజిక సమతుల్యతను పాటించడంలో తమ ప్రభుత్వం ఈ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. జగనన్న నాయకత్వంలో గుంటూరు నగరాన్ని గొప్ప నగరంగా తీర్చి దిద్దుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని చెప్పారు. గుంటూరు నగర అభివృద్ధిలో ఇప్పటికే తమ ప్రభుత్వం ప్రత్యేక ముద్ర వేసుకుందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సుబ్బారెడ్డి, వార్డ్ ఇంచార్జిలు, క్లస్టర్ ఇన్చార్జిలు, మండల ఇన్చార్జిలు, ఆయా అనుబంధ విభాగాల నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు జగన్ వెంటే



**కంచికచర్ల జనవరి 20 మేజర్ న్యూస్ :** ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలంతా ముఖ్యమంత్రి జగన్ వెంట ఉన్నారని నందిగామ సభ్యులు మొండితోక జగన్ మోహన్ రావు అన్నారు గండేపల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో శనివారం సంక్షేమ పథకాలను గురించి శాసనసభ్యులు ప్రజలకు వివరించారు.ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అన్ని వర్గాల అన్ని రంగాల ప్రజలకు మంచి చేయాలన్నదే ముఖ్యమంత్రి జగన్ ధ్యేయమన్నారు. కుల మతాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. గత తెలుగుదేశం పార్టీ హయాంలో చంద్రబాబు నాయుడు కేవలం ఒక సామాజిక వర్గంలోని పెత్తందారులకు మాత్రమే మేలు జరిగేలా అవినీతికి బాటలు వేస్తూ పాలన చేశారని విమర్శించారు. తెలుగు దేశం పార్టీ పెత్తందారుల పార్టీ అని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సామాన్యుల పార్టీ అని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలను రాజ్యాధికారంలో భాగం చేస్తూ 70 శాతానికి పైగా వారికి మంత్రి పదవులు కేటాయించారన్నారు. రానున్న ఎన్నికల్లో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలంతా వైయస్ జగన్ వెంటే ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు,తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ఉచిత కుట్టు శిక్షణా కేంద్రం ఏర్పాటు పై సమావేశం




**గన్నవరం (ఉంగుటూరు), జనవరి 20, మేజర్ న్యూస్ :** ఆత్కూరు స్వర్ణ భారతి ట్రస్ట్లో, ఉంగుటూరు గ్రామంలో స్త్రీ శక్తి భవనంలో 18 సం వయస్సు నుండి 45 సం. వయస్సు వరకు గల పేద మహిళలకు ఉచిత కుట్టు శిక్షణా కేంద్రం పై ఏర్పాటు సమావేశం నిర్వహించబడినది. యూనియన్ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ... ఈ నెల 22 నుండి ఈ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయుటకు సన్నాహాలు చేస్తుమని తెల్పినారు. ఎం.పి.డి.ఓ జి.ఎస్.వి శేషగిరిరావు మాట్లాడుతూ.. ఇప్పటికి 35 మంది పేద మహిళలను ఎంపిక చేసామని వీరికి ఉచిత భోజనం, టీ, స్నాక్ ఇస్తూ కుట్టు మిషన్ శిక్షణ ఇస్తామని, శిక్షణ అనంతరం ఉచితంగా కుట్టు మిషన్ అందజేస్తామని వీరికి ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం లో జాయిన్ చేయించి రూ.1.00 లక్ష వరకు రుణ అందేలా చూస్తామని ఎం.పి.డి.ఓ తెల్పినారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ డి.పరదేశి, బ్యాంకు అధికారులు పాల్గొనారు.




## భారీ ఆఫర్లతో శాంసంగ్ గ్రాండ్ రిపబ్లిక్ డే సేల్

**విజయవాడ, మేజర్ న్యూస్ :** భారతదేశంలో అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శాంసంగ్, గెలాక్సీ స్మార్ట్ఫోన్లు, ల్యాప్టాప్లు, టాబ్లెట్లు, వేరబల్ వస్తువులు, శాంసంగ్ టీవీలు, ఇతర డిజిటల్ ఉపకరణాలు వంటి అనేక రకాల శాంసంగ్ ఉత్పత్తులపై బంపర్ ఆఫర్లు, క్యాష్బ్యాక్తో గ్రాండ్ రిపబ్లిక్ సేల్ను ప్రారంభించింది. ఈ ఆఫర్లు శాంసంగ్ డాట్ కామ్, శాంసంగ్ షాప్ యాప్, శాంసంగ్ ఎక్స్క్లూజివ్ స్టోర్లలో అందుబాటులో ఉంటాయి.

## సీడీఎస్ఎల్ బహు భాషా కార్యక్రమాలను ప్రారంభించిన సెబీ

**విజయవాడ, మేజర్ న్యూస్ :** తమ రజతోత్సవ సంవత్సరాన్ని పురస్కరించుకుని, ఆసియాలో మొట్టమొదటి లిస్టెడ్ డిపాజిటరీ అయిన సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ (ఇండియా) లిమిటెడ్, క్యాపిటల్ మార్కెట్ ల్యాండ్స్కేప్లో ఇంక్లూజివిటీ, యాక్సెసిబిలిటీకి తన నిబద్ధతను వెల్లడించడానికి రెండు ప్రత్యేకమైన బహు భాషా కార్యక్రమాలను ప్రారంభించినట్లు వెల్లడించింది. ఇటీవల జరిగిన రజతోత్సవ కార్యక్రమంలో ఈ కార్యక్రమాలను సెబీ ఛైర్పర్సన్ మాధబి పూరి బుచ్ ప్రారంభించారు.

## ఎల్వీపీఐ నుంచి ఇంటి వద్దనే సమగ్ర కంటి పరీక్షలు



**విజయవాడ, మేజర్ న్యూస్ :** విజయవాడలోని కోడే వెంకటాద్రి చౌదరి ప్రాంగణం దరి ఎల్ వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల (ఎల్విపిఈఐ) హోమ్ కేర్ నేత్ర పరీక్షల సేవలను ఆవిష్కరించినట్టు ఆ సంస్థ ప్రతినిధి తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అనుబంధంగా అంధత్వ నివారణకు కట్టుబడి అసాధారణ సమగ్రమైన నేత్ర వైద్య సేవలను అందిస్తున్న ఉత్తమ వైద్య సంస్థ గా తమ సంస్థ పేరుగాంచింది అన్నారు. ఎల్ వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల నివారించుటకు వీలైన అంధత్వం పోగొట్టుటకు యూనివర్సల్ నేత్ర సంరక్షణ పరీక్షలు విస్తరింప చేయుటకు వైద్యశాల వద్దకు స్వయంగా రాలేని శారీరక ఇబ్బందులున్న వ్యక్తులు వృద్ధులు వంటి వారికోసం, ప్రత్యేకంగా అవసరమైన వారి కోసం నేత్ర వైద్య సేవలు అందించుటకు దృష్టి సారించు నిమిత్తం ఈ హోమ్ కేర్ సర్వీసు ప్రారంభించామని చెప్పారు. మరిన్ని వివరాల కోసం 0866-671-2000/20 ఫోన్ నెంబర్ లో సంప్రదించాల్సిందిగా కోరారు.

## శంకరపాడులో చనిపోయిన వీఆర్వో రుంజల రమేష్ భౌతిక కాయానికి నివాళులర్పించిన వెనిగండ్ల రాము



**నందివాడ, మేజర్ న్యూస్:** ముసునూరు మండలం కాట్రేనిపాడు గ్రామంలో వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న రుంజల రమేష్ అనారోగ్య కారణంగా శుక్రవారం రాత్రి చనిపోవడం జరిగింది. రమేష్ స్వస్థలం నందివాడ మండలం శంకరపాడు గ్రామం. రమేష్ కి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. శంకరపాడు గ్రామానికి తీసుకువచ్చిన వీఆర్వో రుంజల రమేష్ భౌతిక కాయానికి శనివారం గుడివాడ తెలుగు దేశం పార్టీ ఇన్చార్జి వెనిగండ్ల రాము సందర్శించి నివాళులు అర్పించారు.రమేష్ కుటుంబ సభ్యులను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఉప్పల వెంకటేశ్వరరావు, శంకరపాడు సర్పంచ్ కైలే సుబ్బారావు రామాపురం మాజీ సర్పంచ్ అందుగుల యేసు పాదం, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కంభం దాసు, కార్యదర్శి పులవర్తి ప్రభుదాసు,బట్టు లాజరు, దారం బాలాజీ, తురుమిల్లి వేద నాయకులు, పులవర్తి నాని, బట్టు రవి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



### రక్షిత మంచినీటి ట్యాంకు సీసీ రోడ్లు ప్రారంభోత్సవం

**కంచికచర్ల జనవరి 20 మేజర్ న్యూస్ :** పెండ్యాల గ్రామంలో ఎంపీ నిధులు రూ.40 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన రక్షిత మంచినీటి సరఫరా ఓవర్ హెడ్ ట్యాంక్ ను విజయవాడ పార్లమెంటు సభ్యులు కేసినేని నాని నందిగామ శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ లు శనివారం ప్రారంభించారు.అలాగే గ్రామంలో ఎంపీ నిధులు మరో రూ.30 లక్షల తో నూతనంగా నిర్మించిన సిసి రోడ్లను వారు ప్రారంభించారు. ఎమ్మెల్యే జగన్ మోహన్ రావు మాట్లాడుతూ కేశినేని నాని టీడీపీ ఎంపీగా ఉన్నప్పటి నుంచే మేమిద్దరం స్వచ్ఛమైన రాజకీయాలు చేశాం అన్నారు.పార్లమెంటు పరిధిలో ఆరుగురు టీడీపీ ఎమ్మెల్యేలు ఓడిపోయినా ఆయన ఎంపీగా గెలిచారు అన్నారు. అలాంటి వ్యక్తి వైసిపిలోకి వేస్తే చాలు మా పార్టీలోకి ఎవరు రావాల్సిన అవసరం లేదు అని తెలిపారు. నాని పార్టీలోకి రావడమే విజయవాడ పార్లమెంటు విజయం సాధించినట్లే అని జోష్యం చెప్పారు.కేశినేని వైసిపి లోకి రావడం తమ పార్టీ పెద్ద బలం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎండీఓ శిల్ప మండల అధికారులు వైసిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా సంఘాల నాయకుల అరెస్ట్



**గన్నవరం, జనవరి 20, మేజర్ న్యూస్ :** అంగన్వాడి ఆందోళనకు మద్దతుగా శనివారం గన్నవరంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వీనస్ సెంటర్లో జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. రహదారిపై పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించిపోయింది. ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నాయకులు నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న గన్నవరం సిఐ కనకారావు తన సిబ్బందితో గాంధీ బొమ్మ సెంటర్కు చేరుకున్నారు. సిఐటియు నాయకులు వై.నరసింహారావు, బేత శ్రీనివాసరావు, అజ్మీరా వెంకటేశ్వరరావు, నల్లి ఆంజనేయులు, మల్లంపల్లి ఆంజనేయులు బలవంతంగా రోడ్డుపై ఈడ్చి వేశారు. వారిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తీసుకువెళ్లారు. వీరికి మద్దతుగా సిఐటియు, ప్రజా సంఘాల నాయకులు స్టేషన్ కు వెళ్లారు. నాయకులను వ్యక్తిగత పోచీకత్తపై పోలీసులు విడుదల చేశారు. అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని నరసింహారావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు అత్యంత ఉత్సాహంగా హాజరయ్యారు.

### గౌతమబుద్ధ స్తూపం వద్ద చెత్తవేసి అపరిశుభ్రపరుస్తున్న వారిపై చర్యలు తీసుకోండి



**గుడివాడ, మేజర్ న్యూస్:** గుడివాడ గౌతమబుద్ధ స్థూపం దగ్గర చెత్తా చెదారం పారబోయడంపై లిటిల్ హ్యాండ్స్ సంస్థ ప్రతినిధులు మున్సిపల్ కమిషనర్ మురళీ కృష్ణకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఇది రక్షిత ప్రాంతమని ఆర్కియాలజీ డిపార్ట్మెంట్ పేర్కొన్నందున పరిసరాలు పరిశుభ్రంగా, పచ్చగా ఉండేలా చూడాలన్నారు. పరిసరాలను అపరిశుభ్రపరుస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం ఎల్కెర్ఓ లీగల్ సెల్ రాష్ట్ర సమన్వయకర్త హేమంత్ కుమార్ అల్లూరి పర్యవేక్షణలో, లిటిల్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు హరిత, ఉపాధ్యక్షుడు కళ్యాణ్ నానుపాత్రుని, బి. కార్తీక్, చరణ్ జంపా, బాలాజీ, హర్ష, జస్వంత్, తదితరులు పాల్గొన్నారు.

# రేపల్లె రైలుమార్గంకి ముందడుగు..



**మచిలీపట్నం, మేజర్న్యూస్ :** ఎంతోకాలంగా కృష్ణ – గుంటూరు జిల్లా ప్రజలు ఎదురుచూస్తున్న రేపల్లె రైలు మార్గం ఏర్పాటు కోసం డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ను పంపాలని కృష్ణా జిల్లా కలెక్టర్ను హోం శాఖను రైల్వే శాఖను ఆదేశిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశాయి. ఈ మేరకు శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రం మచిలీపట్నానికి ఆదేశాలు అందాయి. మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు బాలశౌరి కృషితో రేపల్లె రైలు మార్గానికి అంకురార్పణ జరగటం అభినందనీయమని కృష్ణ జిల్లా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి లంకిశెట్టి బాలాజీ అన్నారు. శనివారం మచిలీపట్నంలో లంకిశెట్టి విలేకరులతో మాట్లాడుతూ ఎందరో మంత్రులు ఎందరో ఎంపీలు చేయలేని పనిని బాలసౌరి చిత్తశుద్ధితో ప్రజల కోసం చేసిన కృషి ఫలించిందని బాలాజీ అన్నారు. బాడిగ రామకృష్ణ ఎంపీ కృషివల్ల గతంలో నాలుగు రైళ్లు మచిలీపట్నం నుండి ఏర్పడటం వలన ప్రజలకు సౌకర్యవంతంగా ఉందన్నారు. మచిలీపట్నం రైల్వే స్టేషన్ లో లిఫ్ట్ కోసం తన నిధుల నుండి 50 లక్షలురూపాయలు కేటాయించినందుకు కూడా బాలాజీ ధన్యవాదలు తెలియజేశారు. రేపల్లె రైలు మార్గం ఏర్పాటు చేయడం ద్వారా కృష్ణ గుంటూరు జిల్లా ప్రజల సుదీర్ఘకాలం పోరాటానికి ఫలితం దక్కింది అన్నారు. బాలశౌరి నాయకత్వానికి పనితనానికి పోరాట పటిమకు రేపల్లె రైలు మార్గం ఒక ఉదాహరణ అని బాలాజీ అన్నారు. మచిలీపట్నం లో మెడికల్ కాలేజ్ ఏర్పాటు కోసం, భోగారాజు పట్టాభిసీతారామయ్య స్మారక భవన నిర్మాణం కోసం యూనియన్ బ్యాంక్ నుండి రూ.40 కోట్లు నిధులు తీసుకురావడం బాల సోరి చేసిన అభివృద్ధి పనికి తార్కనాలని బాలాజీ అన్నారు. బాల శౌరి ఎక్కడ ఉంటే అభివృద్ధి అక్కడేనని ఆయన నిరూపించారని బాలాజీ అన్నారు. రేపల్లె రైలు మార్గం ఏర్పాటు అయినట్లు అయితే మచిలీపట్నం అనుహ్య ముగా అభివృద్ధి చెందుతుందని బాలాజీ అన్నారు. రాజకీయాలకు అతీతంగా ఉభయ జిల్లాల ప్రజా ప్రతినిధులు అందరూ రైలు మార్గం ఏర్పాటు చేసే వరకు సమిష్టిగా కృషి చేయాలని, ఏ విధమైన అడ్డుపుల్లలు వేయటానికి వీలులేదని బాలాజీ అన్నారు.

**ఎంపీ బాలశౌరికి అభినందనలు**

**కృష్ణాజిల్లా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి లంకిశెట్టి బాలాజీ**

# శోభయమానంగా శోభాయాత్ర



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** ప్రపంచంలో కెల్లా అత్యద్భుత కట్టడం అయోధ్య రామమందిరం పలువురు ప్రముఖులు అభిప్రాయ పడ్డారు. శనివారం విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో గీతామందిరం ఆవరణ నుండి అయోధ్య రామ మందిర ప్రతిష్ట మహోత్సవానికి సంఘీభావంగా శోభాయాత్రను నిర్వహించారు. ప్రపంచం అంతటా రాములవారి పండుగ ఈ నెల 22 వ తేది సోమవారం జరుగుతుందని ప్రతి హిందువు గర్వపడే రీతిలో జరుగుతున్న అయోధ్యరామమందిరం ప్రాణ ప్రతిష్ఠలో భాగస్వామ్యం కావడం నేటి తరం వారి అదృష్టం అని విశ్వహిందు పరిషత్ పేర్కొంది. అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవ కార్యక్రమానికి మద్దతుగా నిర్వహించిన శోభాయాత్రలో ప్రజలు సంపూర్ణ సహకారం అందిస్తున్నారని, అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించి ప్రపంచ వ్యాప్తంగా హిందు ధర్మం గొప్పతనం చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి నరేంద్ర మోదీ అని పలువురు కొనియాడారు. 500 ఏళ్ళ నిరీక్షణ ఫలించిందని ఇది ముమ్మాటికి భారత జాతి ఐక్యతకు ప్రతీకగా నిలిచే కార్యక్రమం అని శ్రీరాముని బాల విగ్రహ ప్రాణ ప్రతిష్ట పండుగను నా బూతో నా భవిష్యత్ అన్న చందంగా అంగరంగ వైభవంగా జరిపిస్తున్న అయోధ్య ట్రస్ట్వారికి దేశ నలుమూలల నుండి నీరాజనాలు పడుతున్నారన్నారు. ఇది జాతి ఐక్యతకు నిదర్శం అన్నారు. మతాలకు, కులాలకు, ప్రాంతాలకు అతీతంగా జరుపుకునే పండుగ శ్రీరాముని బాలవిగ్రహ ప్రతిష్ట అని అన్నారు. ఈ మహా క్రతువులో ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది హిందువులు పాల్గొంటున్నారని, సనాతన ధర్మం విశ్వవ్యాప్తం చేయడంలో అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని పలువురు పార్టీ నేతలు, ప్రజా సంఘాలు అన్నారు. జై శ్రీరామ్ జెండాలు నినాదాలతో రామ నామ సంకీర్తన పాడుతూ మహిళలు శోభాయాత్రలో పాల్గొన్నారు. ముందుగా శోభాయాత్రను శాసనసభ్యులు సింహాద్రి రమేష్బాబు, కృష్ణా గుంటూరు జిల్లాల రైతు విభాగ జోనల్ ఇన్చార్జ్ కడవకొల్లు నరసింహారావులు ప్రారంభించి శోభాయాత్రలో పాల్గొనగా జనసేన మండల పార్టీ అధ్యక్షులు గుడివాక శేషుబాబు, బిజెపి, కాంగ్రెస్,టిడిపికి చెందిన నేతలు సంఘీభావం తెలుపుతూ శోభాయాత్రలో పాల్గొన్నారు. మొత్తం మీద శోభాయాత్ర శోభయమానంగా జరిగింది.

**ప్రపంచంలో అత్యద్భుత కట్టడం అయోధ్య రామమందిరం**



## ఆఖరిరోజు మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు



**వత్సవాయి జనవరి 20 మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు చివరి రోజుకు చేరుకున్నాయి. ఆఖరి రోజులో భాగంగా జడ్పీటీసీ సభ్యురాలు యేశపోగు దేవమణి శ్రీనివాసరావు, ఎంపిపి కొలుసు రమాదేవి తిరుపతి రావు, గ్రామ సర్పంచ్ భూక్యా సీతమ్మ చేతులు మీదగా క్రికెట్ ప్రారంభించి ఇరు జట్లలకు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం ఆంధ్రా ఆటలు పోటీలకు విశేష స్పందన వచ్చిందన్నారు. ఈ గొప్ప తనం మన జగనన్న కు చెందుతుందన్నారు.దేశంలో మరెక్కడా లేని విధంగా మట్టిలో మాణిక్యాలను వెలికి తీసే విధంగా ఆటలను ప్రోత్సాహించి ప్రతి ఒక్కరి లో దాగి వున్న ప్రతిభను గుర్తించేలా ఆటలు పోటీలు ఆడుదాం ఆంధ్రా ద్వారా మండలస్థాయి నుండి అంతర్జాతీయ స్థాయికి వెళ్లేలా కృషి చేసిన మహానుభావుడు మన ముఖ్యమంత్రి అని అన్నారు. తదనంతరం ఎంపిపి మాట్లాడుతూ ఆటల వల్ల ప్రతి ఒక్కరి లో మానసిక ఉల్లాసం,శరీర దారుఢ్యం పెం పోంది ఉద్యోగాలకు ప్రభుత్వం నిర్వాహించే పరీక్షలు సునాయసంగా ఈవెంట్స్ లో ఉతీర్ణత సాధించవ చ్చు అని అన్నారు. సర్పంచ్ మాట్లాడుతూ గెలుపు ఓటములు సహజం కానీ గెలవాలి అని కసితో ఆడాలని ఆమె సూచించింది.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గుత్తా శంకరరావు, వైస్ ఎం పిపి కొలికపోగు వెంకటేశ్వర్లు పిఏసిఎస్ అధ్యక్షులు రంగిశెట్టి ముక్తేశ్వరరావు, వార్డు మెంబర్ రాయల శ్రీను,సీనియర్ నాయకులు భూక్యా రాజా నాయక్, పార్టీ నాయకులు క్రీడాకారులు పాల్గొన్నారు.



### అయ్యప్ప కోవెలలో మండలి

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** కేరళ రాష్ట్రం లోని శబరిమలైలో కొలువై ఉన్న అయ్యప్ప స్వామి వారిని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, తనయుడు తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్రామ్లో శనివారం స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామియే శరణం అయ్యప్ప అంటూ స్వామి వారిని దర్శించుకున్న అనుభూతిని పత్రికాముఖంగా పంచుకున్నారు.

# కిడ్నీ వ్యాధి బారిన పడిన విద్యార్థిని ఆర్థిక సాయాన్ని అందచేసిన తులసి దర్మచరణ్



గుంటూరు, మేజర్ న్యూస్ : గుంటూరు నగరానికి చెందిన తెత్తురాజు స్వాతి అనే బిటెక్ విద్యార్థినికి రెండు కిడ్నీలు దెబ్బతిన్నాయన్న విషయం వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ దృష్టికి రావడంతో ఆయన వెంటనే స్పందించి సహృదయంతో ఆమెకు సంవత్సరం పాటు వైద్య ఖర్చులకు, టెస్టులకు అయ్యే 73,200/- రూపాయలను ధర్మచరణ్ శనివారం వేద సీడ్స్ కార్యాలయంలో అందచేశారు. ఈ సందర్భంగా ధర్మచరణ్ మాట్లాడుతూ సన్నిహితుల ద్వారా స్వాతి పరిస్థితి తెలిసిందని, చదువుకునే వయసులో కిడ్నీ వ్యాధి బారిన పడటం ఎంతో బాధాకరమైన విషయమన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కూడా స్వాతి చదువుకుంటూ ధైర్యంగా జీవించడం ఎంతో మందికి స్ఫూర్తిదాయకం అని అభినందించారు . భవిష్యత్ లో ఇతర వైద్య ఖర్చులకు, కిడ్నీ మార్పిడి సమయాల్లో కూడా ఆర్థికంగా చేయూతనందిస్తానని ధర్మచరణ్ హామీ ఇచ్చారు. స్వాతి కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ 3వ సంవత్సరం చదువుతుందని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుర్రాల రంగారావు, వడ్లమూడి రవి, స్వాతి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# వైకాపా నీచ రాజకీయాలు మానుకోవాలి



గుంటూరు మేజర్ న్యూస్ : రాబోయే ఎన్నికల్లో ఓటమి ఖాయమని తెలుసుకున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాదరణ కలిగిన తెలుగుదేశం పార్టీ నాయకులపై నీచ రాజకీయాలకు పాల్పడుతుందని ఇది అత్యంత హేయమైన పిరికిపందల చర్యలని తెలుగుదేశం పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు కూచిపూడి రాజేష్ బాబు పేర్కొన్నారు రాజ్యాంగ ప్రదాత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని కూల్చివేస్తామని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ విలేకరుల సమావేశంలో అన్నట్లు ఒక ఫేక్ న్యూస్ ని క్రియేట్ చేసి దానిని సోషల్ మీడియా ద్వారా హల్చల్ చేపిస్తున్న వైసిపి నాయకులకు సిగ్గుండాలని ఆయన అన్నారు ఐదు సార్లు ఒకే నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించి ఆ నియోజకవర్గంలోని బడుగు బలహీన దళిత వర్గాల ప్రజలందరి మన్ననలు పొందిన గొప్ప నాయకుడు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పై అసత్య ప్రచారాలు మానుకోవాలని ఆయన వైసీపీ నాయకులకు హెచ్చరించారు వైసీపీ ప్రభుత్వ పాలనలో దళితులపై దాడులు పెరిగి అరాచకాలు జరుగుతుండటం దేనికి నిదర్శనమని ఆయన ప్రశ్నించారు నాలుగున్నర ఏళ్ల పాటు దళితులు గుర్తుకురాని జగన్మోహన్ రెడ్డికి 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసినప్పుడు మాత్రం దళితులు గుర్తుకొచ్చారని ఇది ప్రజలు గమనిస్తున్నారని అన్నారు గుంటూరు జిల్లాలో అత్యధిక మెజార్టీతో గెలిచే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ మనోధైర్యాన్ని ఇలాంటి అసత్య ప్రచారాలతో దెబ్బతీయలేరని ఆయన అన్నారు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీ నాయకులు లింగంగుంట సాల్మన్ రాజు మాట్లాడుతూ సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన ధూళిపాళ్ల కుటుంబం పైబురదజల్లే ప్రయత్నాలను వైసీపీ నాయకులు మానుకోవాలని సూచించారు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి ధూళిపాళ్ల కుటుంబం ప్రజాక్షేత్రంలో ప్రజల కోసం ప్రజాశ్రేయస్సు కోసం పాటుపడిన సంగతిని మర్చిపోకూడదని అన్నారు నిన్న కాకమున్న రాజకీయాలకు వచ్చిన వ్యాపారస్తులు ప్రతి విషయాన్ని రాజకీయ కోణంలో చూస్తూ ధూళిపాళ్ల కుటుంబం పై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు నేరుగా ధూళిపాళ్లను ఢీకొనే సత్తా లేక దొడ్డిదారిన అసత్య ప్రచారాలతో నరేంద్ర కుమార్ ప్రతిష్టను దెబ్బతీయాలనుకోవడం వారి వల్ల కాని పని అని ఆయన అన్నారు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వలివేటి మురళీకృష్ణ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రతి ఒక్కరికి స్ఫూర్తి ప్రదాత అని అంబేద్కర్ విగ్రహాన్ని కూలుస్తామని నరేంద్ర కుమార్ అన్నట్లు ఉన్న వీడియోని కానీ వాయిస్ రికార్డుని గాని బయట పెట్టగలిగితే వారికి బేషరతు క్షమాపణ చెబుతామని లేని పక్షంలో ఎవరైతే ఇలాంటి నీచ ప్రచారాలకు పాల్పడుతున్నారు వాళ్ళందరూ నరేంద్ర కుమార్ కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు తెలుగుదేశం పార్టీ మైనార్టీ రాష్ట్ర నాయకులు మోసిన్ మాట్లాడుతూ దళితులను మైనార్టీలను తన సొంత అన్నదమ్ము లుగా భావించి ప్రతి ఒక్కరికి గౌరవాన్ని ఇచ్చి పలకరించే నరేంద్ర కుమార్ అంబేద్కర్ విగ్రహాన్ని కూలుస్తాం అని అన్నారని అసత్య ప్రచారాలు చేస్తున్న వైసీపీ నాయకులు తమ వద్ద ఆధారాలు ఉంటే చూపాలని సవాలు విసిరారు ఎవరైతే ఇలాంటి అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ధూళి పాళ్ల నరేంద్ర కుమార్ చేబ్రోలు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారని చట్టం తన పని తాను చేసుకుం టూ దీనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటుందని ఆ నమ్మకం మాకు ఉందని ఆయన అన్నారు అనంతరం పెదకాకాని సెంట ర్లోని అంబేద్కర్ విగ్రహానికి తెలుగుదేశం పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ బీసీ నాయకులు శివాలయం మాజీ చైర్మన్ దర్శి భాస్కరరావు విన్నకోట పూర్ణచంద్రరావు కుక్కల మల్లికార్జునరావు బోయపాటి రామ్మోహన్ చిట్టిబాబు విల్సన్ రవి తదితరులు ఉన్నారు

# స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటు చేయకుంటే ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధం : పారేపల్లి మహేష్



మంగళగిరి, మేజర్ న్యూస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ ఆధ్వర్యంలో మంగళగిరి షరాఫ్ బజార్ లోని స్వర్ణకార సోదరులకు పనిముట్ల పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించా రు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతి థిగా స్వర్ణకార సంఘ రాష్ట్ర అధ్యక్షులు కర్రి వేణుమాధవ్ హాజరై కార్మికులకు 2 వేయింగ్ మిషన్లు, 35 మందికి స్వర్ణకార పనిముట్లు, 100 గోడ గడియారా లను పంపిణీ చేశారు. మొదలు పెట్టడం జరిగింది. ఈ సందర్భం గా పారేపల్లి మహేష్ మాట్లాడుతూ స్వర్ణకారులకు కార్పొరేషన్ నిధులు లేనందువల్ల అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకొని కుటీర పరిశ్రమలు చేస్తూ ఉన్న పేద స్వర్ణకారులు చాలా నష్టపోతున్నారని అన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం ఏర్పరిచే ఏ రాజకీయ పార్టీ అయినా సరే గెలిచిన మూడు నెలల్లోపు స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే గుంటూరు జిల్లా స్వర్ణకార సహోదరుల మద్దతుతో ఆమరణ నిరాహార దీక్ష చేయడానికి తను సిద్ధమని పారేపల్లి అన్నరు. ఈ కార్యక మంలో ధనాలకోట వాసు, కొల్లి గిరిధర్, జింక దివ్య నారాయణ, యు నాగే ంద్ర కుమార్ మంద్రు సత్యనారాయణ, కాట్రు ధనుంజయ్, దామర్ల నారాయణ ,గడ్డం యోగి, తిరువీధుల కిరణ్, కాగితాల స్వాతి గౌడ్ పాల్గొన్నారు.

# దళిత జేఏసీ నేత గడ్డం మార్టిన్ అకాల మరణం



తుళ్లూరు మేజర్ న్యూస్ : అమరావతి ఉద్యమం ప్రారంభం నుండి నేటి వరకు అమరావతి రైతుల కోసం నిరంతరం పోరాటం చేసిన దళిత జేఏసీ నేత గడ్డం మార్టిన్ శనివారం అకాల మరణం చెందారు ఆయన మరణం పట్ల అమరావతి దళిత జేఏసీ నేతలు రైతులు మహిళలు రైతు కూలీలు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు అమరావతి ఉద్యమంలో కీలక భూమిక పోషించిన గడ్డం మార్టిన్ మన మధ్య లేకపోవడం ఎంతోమంది రైతుల కన్నీళ్లు పెట్టుకున్నారు గుండెపోటుతో మరణించిన గడ్డం మార్టిన్ అంత్యక్రియలు మందడం గ్రామంలో నిర్వహించనున్నట్లు అమరావతి దళిత జేఏసీ అమరావతి జేఏసీ నేతలు తెలిపారు విద్యావంతుడుగా పోరాటపటిమ గల వ్యక్తిగా అందరి కి సుపరిచితుడైన గడ్డం మార్టిన్ అంత్యక్రియలకు తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి తెనాలి శ్రావణ్ కుమార్ హాజరుకానున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి

# అరటికాయల లోడు లారీ బోల్తా



గుంటూరు క్రైం, మేజర్ న్యూస్: గుంటూరు నగర సమీపంలోని జాతీయ రహదారి పై లాలుపురం సమీపంలో అరటికాయల లోడు లారీ శనివారం ఉదయం బోల్తా పడింది. అన్నమయ్య జిల్లా మదనపల్లి నుంచి విజయవాడ వైపుకు లారీ వెళ్తోంది. వేగం అదుపుతప్పి ముందు వెళ్తున్న లారీని వెనుక ఢీకొంది. ఈ నేపథ్యంలో లారీ ఎక్స్ప్రెస్ హైవే నుంచి సర్వీస్ మార్గంలోకి బోల్తా పడింది. లారీ నుజ్జయి... ముందు చక్రాలు పూర్తిగా విరిగిపోయాయి. క్లీనర్ బాలాజీ గాయపడ్డాడు. తెలిసిన వెంటనే పెట్రోలింగ్-2 పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంపై నల్లపాడు పోలీసులు విచారణ చేస్తున్నారు.

# డాక్టర్ అషానీ కలిసి సత్కరించిన గ్రామ వార్డ్ సచివాలయం ఉద్యోగుల



గుంటూరు, మేజర్ న్యూస్ : గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ లో లిచీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ శ్రీమతి అషా ని గ్రామ వార్డ్ సచివాలయం ఉద్యోగుల అసోసియేషన్ 13/2020 నాయకులు, వార్డ్ సచివాలయం ఎన్విరాన్మెంట్ కార్యదర్శులు అసోసియేషన్ నాయకులు కలిసి పుష్ప గుచ్ఛం తో శుభా కాంక్షలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డ్ సచివాలయం ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర నాయకులు గుడిసె దాసు, చింతల రాజ్ కుమార్,దుర్గా రావు,కవిత, నాగేంద్ర, రమేష్, పృథ్వీ, బుల్లియ్యాలి,ఇతర ఉద్యోగ నాయకులు పాల్గొన్నారు.

# బెదిరింపులతో అంగన్వాడీల ఐక్యతను విచ్ఛిన్నం చేయలేరు



తాడికొండ మేజర్ న్యూస్ : బెదిరింపులతో అంగన్వాడీల ఐక్యతను విచ్ఛిన్నం చేయలేరని ఫిరంగిపురం ప్రాజెక్టు లీడర్ ధనలక్ష్మి అన్నారు. శనివారం తాడికొండ పోలీస్ స్టేషన్ వద్ద 40 రోజులుగా చేస్తున్న సమ్మె శిబిరంను ఆమె సందర్శించి మాట్లాడారు. అంగన్వాడీల సమ్మెను నిర్వీర్యం చేసే కుట్రను సీడీపీఓ, సూపెర్వైజర్లు ఆవలంబిస్తున్నారని అన్నారు.అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుండా ఒక పక్క మంత్రులు మరో పక్క అధికారులు బెదిరిస్తున్నారని, ప్రమోషన్ లిస్టులో ఉన్నారని కొంతమంది కార్యకర్తలలను ప్రలోబాలకు గురించేసి యూనియన్ ఐక్యతను దెబ్బ తీసేలా వారి చర్యలు ఉన్నాయన్నారు. సమ్మెను మరింత ఉద్రితంగా చేసి తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను విరమించమని తేల్చి చెప్పారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నేతాజీ మాట్లాడుతూ ఉద్యోగాలనుండి తొలగించే అధికారం సీడీపీఓ లకు ఎవరిచ్చారని ప్రశ్నించారు, శనివారం ఉద్యోగాలలో చేరాలని లేకుంటే తొలగిస్తామని బెదిరుస్తున్నారని అన్నారు, ఈ బెదిరింపులకు అంగన్వాడీలు తగిన సమాధానం ఇస్తారని అన్నారు. కార్యక్రమంలో గాంధీ రాంమోహనరావు, భాస్కరరావు,రాజ్యలక్ష్మి, విజయలక్ష్మి,షహీదా, నూర్జహన్, శాంతి తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్లో నూతన గదులు ప్రారంభం



గుంటూరు, మేజర్ న్యూస్ : కలక్టరేట్ లో గతంలో వున్న హెచ్ సెక్షన్ కార్యాలయ గదులకు మరమ్మత్తులు చేసి కొత్తగా అన్ని హంగులతో రినోవేట్ చేసిన ఎన్నికలు ప్రోటోకాల్ కో ఆర్డినేషన్ సెక్షన్ ను శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి , సంయుక్త కలెక్టర్ జి. రాజకుమారి తో కలసి ప్రారంభించారు. అనంతరం సిబ్బందికి ఏర్పాటు చేసిన సీటు వారీగా ఏర్పాటు చేసిన క్యాబిన్లను పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ సిబ్బంది తో మాట్లాడుతూ ఈ కో ఆర్డినేషన్ సెక్షన్ లో ప్రోటోకాల్. ఈ సందర్భంగా ఆర్ ఓ ప్లాంట్ ద్వారా శుద్ధి చేసిన మంచి నీటిని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి. రాజకుమారి స్వీకరించి నాణ్యతను పరిశీలించి సంతోషాన్ని వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఆర్ ఓ ప్లాంట్ కు గంటకు 500 లీటర్ల శుద్ధి నీటిని అందించగల సామర్థ్యం ఉందన్నారు. ఇప్పటి వరకు కలక్టరేట్ కు త్రాగునీటి వసతి కొరకు క్యాన్ల ద్వారా నీటిని తెప్పించి వినియోగించడం జరుగుతుండేది అన్నారు. ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమానికి వచ్చే ప్రజలతో పాటు కలక్టరేట్ లోని సిబ్బందికి త్రాగునీటి అవసరాలు తీర్చేందుకు ఈ ఆర్ ఓ ప్లాంట్ ఎంతో సహాయకారిగా వుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. చంద్ర శేఖర రావు, ఆర్.డబ్ల్యు.ఎస్ ఎస్.ఈ సురేష్, కలక్టరేట్ ఏ.ఓ పూర్ణచంద్ర రావు, కలక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ విధానాల వల్ల కునరిల్లుతున్న చేనేత రంగం - ముప్పాళ్ల నాగేశ్వరరావు



మంగళగిరి, మేజర్ న్యూస్: దేశంలో వ్యవసాయ రంగం తరువాత అతి పెద్ద రంగమైన చేనేత రంగం ప్రభుత్వాల విధానాల కారణంగా నిరాధారణకు గురై కునరిల్లుతుందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. మంగళగిరి మార్కండేయ కళ్యాణమండపంలో రెండు రోజులపాటు జరగనున్న ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం 13వ రాష్ట్ర మహాసభలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో సుమారు 7 కోట్ల మంది చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని ఇటువంటి రంగాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించడం శోచనీయమని అన్నారు. ఆంధ్రప్రదేశ్లో సుమారు 1,50,000 మగ్గాలు ఉన్నాయని వీటిపై లక్షలాది మంది కార్మికులు ఆధారపడి ఉన్నారని ఒక్క మంగళగిరి పట్టణంలోనే 20వేల మగ్గాలు ఉండేవని నేడు అవి వందల సం ఖ్యలోకి వచ్చేయడం ఆందోళన కలిగిస్తుందని అన్నారు. అటు కేంద్రంలో గాని ఇటు రాష్ట్రంలో గాని ఎన్నికల సమయంలో చేనేత రంగానికి ఇచ్చిన హామీల ను ప్రభుత్వాలు విస్మరించడమే ప్రధాన కారణమన్నారు. రాష్ట్రంలో ఆదరణ పేరుతో సొంత మగ్గాలు ఉన్న చేనేత కార్మికులకు 24 వేల రూపాయలను ప్రభుత్వం అందిస్తుందని అయితే సొంత మగ్గాలు ఉన్న కార్మికులు ఎంతమంది ఉన్నారని అన్నారు. సామాజిక హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు జె.వి.వి. సత్యనారాయణమూర్తి ఆల్ ఇండియా వివర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు బండారు ఆనందప్రసాద్, రాష్ట్ర అధ్యక్షులు ఇనమాల శివరాం ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ,చేనేత కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రామనాథం పూర్ణచంద్రరావు, ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కూరపాటి కోటేశ్వరరావు,ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులు జొన్నాదుల వరప్రసాద్, ఏఐటీయూసి నాయకులు చిన్ని సత్యనారాయణ,అన్నవరపు ప్రభాకర్, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శికే.రామాంజనేయులు, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టా హేమ సుందర్ రావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి పామిశెట్టి గోవిందు, గోట్టిముక్కల లక్ష్మి, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లలమర్రి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పిస్తాం



గుంటూరు, మేజర్ న్యూస్ : కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను ఈ నెల 25 నాటికి పూర్తి చేయాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్ఓ కీర్తి చేకూరి ఆయా డిపార్ట్మెంట్ అధికారులకు స్పష్టం చేశారు. శని వారం క్యాంప్ కార్యాలయంలో అదనపు కమిషనర్, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, విద్యా శాఖ అధికారులతో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను ఈ నెల 25 నాటికి పూర్తి చేయాలన్నారు. నగరంలోని ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఉన్నాయని, వాటిలో పోలింగ్ నిర్వహణకు అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటు పై విద్యా శాఖ, నగరపాలక సంస్థ అధికారులు సమన్వ యంతో పని చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో వృద్దులకు, వికలాంగులకు వీలుగా ర్యాంప్ లు, టాయ్ లెట్స్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్న మౌలిక వసతుల ఏర్పాటుపై ఎస్.ఈ.తో కలిసి ఏఈఆర్ఓ, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్లు పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశిం చారు. సమావేశంలో పశ్చిమ నియోజ కవర్గ ఈఆర్ఓ, అదనపు కమిషనర్ కె.లక్ష్మీ శివజ్యోతి, ఎస్ఈ (ఎఫ్ఏసి) సుం దర్రామిరెడ్డి, ఈఈలు కొండారెడ్డి, శ్రీనివాస్, అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ విజయ లక్ష్మీ, ఎంఈఓలు నాగేంద్రమ్మ, జ్యోతి కిరణ్, డిప్యూటీ తహసిల్దార్లు బి.భాస్కర్, మల్లేశ్వరరావు, డి.ఈ.ఈలు పాల్గొన్నారు.

# బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణను జీర్ణించుకోలేక అహంకారంతో మాట్లాడుతున్న ధూళిపాళ్ల



పొన్నూరు మేజర్ న్యూస్ : విజయవాడలో శు క్రవారం జరిగిన సామాజిక సమతా సంకల్ప సభ విజయాన్ని తట్టుకోలేక సోషల్ మీడియా వేదికగా 90 రోజుల్లో అధికారంలోకి వస్తే అంబేద్కర్ విగ్రహాన్ని కూల్చివేస్తానన్న ధూళిపాళ్ల నరేంద్ర వ్యాఖ్యలను వైకాపా దళిత నాయకులు ఖండించారు .సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్న నరేంద్ర వ్యాఖ్యలను వైయస్సార్ కాంగ్రెస్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస పెట్టు పునరావృతం అయితే వెంటపడి కుక్కను కొట్టినట్లు కొడతామన్న ఎస్సీ దళిత నాయకులు. అంబేద్కర్ గారి విగ్రహాన్ని కూల్చివేస్తానన్న నరేంద్ర డౌన్ డౌన్.. డౌన్ డౌన్ నినాదాలు చేసిన ఎస్సీ నాయకులు పొన్నూరుప ట్టణ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎస్ ఆర్ సి పి ఎస్సీ సెల్ అధ్యక్షులు పెరికల కృష్ణమోహన్ ఆధ్వ ర్యంలో శనివారం విలేకరుల సమావేశంలో దళిత నాయ కులు మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వంలో ఎస్సీ దళిత అణగారిన వర్గాలను తమ పార్టీ ఓటు బ్యాంకు గా ప్రోగ్రాం వాడుకుంటూ ఎస్సీ లని చాలా చిన్నచూపు చూశారని ఉదాహ రణలతో.. చింతమనేని ప్రభాకర్ తదితర శాసనస భ్యులతో పాటు వారి పార్టీ అధ్యక్షులుమాజీ ముఖ్య మంత్రివర్యులు చంద్రబాబు నాయుడు ఎస్సీల్లో ఎవడు పుట్టాలి అని కోరుకుంటారు?అనే వ్యాఖ్యల తో ఎస్సీ లపై వారికి ఉన్న చిత్తశుద్ధి తెలుస్తుందని, నిన్నటి రోజు ధూళిపాళ్ల నరేంద్ర వారందరికంటే ఒక మెట్టు పైకి ఎదిగి.. నూతనంగా 125 అడుగుల విగ్రహాన్ని సైతం కూల్చివేసి తొలగిస్తా మని పెత్తందారి అగ్రవర్ణ కుల అహంకారంతో సోషల్ మీడియా వేదికగా మాట్లాడిన మాటలను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని మాట్లాడారు. అంతేగాక గత టిడిపి ప్రభుత్వంలో ఈ స్థలాన్ని 100 సంవత్సరాలు లీజుకి నారాయణ కి ఇచ్చిన చంద్రబాబు నాయుడు, తర్వాత జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో ఆ స్థలంపై కోర్టు కేసులో గెలిచి అదే స్థలంలో విజయవాడ నడి బొడ్డులో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించటం టిడిపి జీర్ణించుకోలేక నూతన విగ్రహాన్ని కూల్చివేసి అమరావతిలో నిర్మిస్తామన్న ధూళిపాళ్ల నరేంద్ర తమ కుల అహంకారంతో ఏ విధంగా మాట్లాడుతున్నది..అంతా ప్రజలు గమని స్తున్నారని వారు పేర్కొన్నారు. రాష్ట్ర ఎస్సీ లందరూ ఈ విషయాన్ని అందరూ ఏకతాటిపై ఉన్నారని, నరేంద్రకు తీవ్రస్థాయిలో బుద్ధి చెప్తామని మాట్లా డటం జరిగింది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రుద్రపాటి ఆదిశేషులు, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు పుట్ల సంపత్ మామిళ్ళపల్లి సర్పం చ్ యానాది రావు, మూకిరి అనిలా కుమారి, పట్టణ ఎస్సీ నాయకులు మల్లెల రాజు, గేరా సంజీవ్, మంద్రు వెంకటరత్నం, వేముల మూర్తి రాజు, కాలింత రమేష్, చిలక సుధాకర్ తదితర ఎస్సీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ధూళిపాళ్ల నరేంద్ర పై అబద్ధాలు అసత్యాలు ప్రచారం చేస్తే తాటతీస్తాం



పొన్నూరు మేజర్ న్యూస్ : డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ గురించి ధూళిపాళ్ల నరేంద్ర అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ అసత్య ప్రచారాలు చేయటం పట్ల తెదేపా నాయకులు తీవ్రంగా ఖండించారు .దమ్ము, ధైర్యం ఉంటే మా నాయకుడు అన్నాడు అని నిరూపించండి లేకపోతే బహిరంగంగా అంబేద్కర్ సాక్షిగా క్షమాపణ చెప్పాలని వారు నిలదీశారు.వైసిపి నాయకులు అధికార మదంతో కొట్టిమిట్టాడుతున్నారని వారు దుయ్యబట్టారు. అంబేద్కర్ గారి ఆశయాలను ఆయన స్ఫూర్తికి తూట్లు పొడిచింది వైసీపీ పార్టీయే నని వారు విమర్శించారు.అంబేద్కర్ గారి ఆశయాలను, ఆయన స్ఫూర్తిని గౌరవించే వారిలో మా నాయకుడు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ముందు వరసలో ఉంటారన్నారు. విష ప్రచారాలు, అసత్య ప్రచారాలు చేస్తున్న వైకాపా నాయకులారా మీరు చేస్తున్న అసత్య ప్రచారాలకు మీ దగ్గర ఒకటి అంటే ఒక్క ఆధారం లేదు ఎందుకంటే మా నాయకుడు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ మీరు అసత్య ప్రచారం చేస్తున్న మాటలు అనలేదు కాబట్టి ఆయన ఆ మాటలు అన్నారు అని నిరూపిస్తే అంబేద్కర్ సాక్షిగా ఐలాండ్ సెంటర్లో నేను ఉరేసుకుంటాను నిరూపించ లేకపోతే మరి మీరు వేసుకుంటారా?...అనిసవాలు విసిరిన పొన్నూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బండ్లమూడి బాబురావు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూతెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి అంబేద్కర్ ఆశయాలను, ఆయన స్ఫూర్తితో ముందుకు వెళ్తున్న పార్టీ టిడిపి పార్టీ అని తెలియ జేశారు. మనిషి జీవితం ఉన్నత స్థాయికి చేరుకోవా లంటే అది విద్యతోనే సాధ్యమని చదువుకోవటం ప్రతి ఒక్కరి హక్కు అని తెలిపిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్ ఆయన స్ఫూర్తితోనే దళిత బిడ్డలు ఉన్నత చదువులకు తెలుగుదేశం పార్టీ హయాంలో విదేశీ విద్య కొరకు అంబేద్కర్ విదేశీ విద్యా పథకాన్ని ప్రవేశపెట్టి ఎందరో దళిత విద్యార్థులకు ఉన్నత విద్యను అభ్యసించేందుకు టిడిపి హయా ంలో చేయూతనిస్తే, జగన్మోహన్ రెడ్డి అధికారం లోకి వచ్చిన తర్వాత అంబేద్కర్ గారి పేరు మీద ఉన్న అంబేద్కర్ విదేశీ విద్యా పథకాన్ని రెండు సంవత్సరాలు పైనే అటకెక్కించి అంబేద్కర్ పేరు మార్చి జగనన్న విద్యా పథకంగా పెట్టుకొని అంబే ద్కర్నుఅవమానించి నప్పుడు మీరంద రూ ఏ తాటి చెట్టు కింద ఉన్నారని ప్రశ్నించారు? ప్రతి ఒక్కరికి సామాజిక న్యాయం అందాలనే అంబేద్కర్ ఆశయాలను తుంగలో తొక్కినది వైసిపి పార్టీ అని దానికి ఉదాహరణ కోడికత్తి డ్రామాలో శ్రీనివాసులు, అయేషా మీరా కేసులో దళిత బిడ్డ సత్యం బాబును ఏళ్ల తరబడి జైలు పాలు చేసింది మీ వైసిపి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కాదా అని ప్రశ్నిం చారు?జగన్ రాష్ట్ర స్థాయిలో దళితు లపై అరాచకాలు చేస్తుంటే నియోజకవర్గం పరిధి లో స్థానిక ఎమ్మెల్యే కిలారి దళితులపై అరాచకాలు చేస్తున్నాడని బియ్యం వ్యాపారి అంజి భరణ బాసు హత్యలో కీలక సూత్రధారులు పాత్రధారులు ఎవరో వారి కుటుంబ సభ్యులు ఆనాడే ప్రజల ముందు పెట్టినప్పుడు మీలో ఎవరైనా ఆనాడు ప్రశ్నించారా? అని వారు నిలదీశారు. ఈ కార్యక్రమంలో పొన్నూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బండ్లమూడి బాబురావు, పొన్నూరు నియోజకవర్గ %ాజ% సెల్ అధ్యక్షులు ఎద్దు సోంబాబు, నిమ్మగడ్డ ధర్మారావు, సౌపాటి వెంకటరావు, ఆశీర్వాదం, తమనం రవి, సుజన్, కోటి, సుబ్బారావు, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

# నారా లోకేష్ సహకారంతో 60 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ



మంగళగిరి, మేజర్ న్యూస్: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సహకారంతో నిర్వహిస్తున్న స్త్రీశక్తి కార్యక్రమం ద్వారా మహిళలకు కుట్టు శిక్షణ ఇవ్వడంతో పాటు స్వయం ఉపాధికి మార్గం చూపేందుకు ఉచితంగా కుట్టు మిషన్లు అందజేస్తున్నారని నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి అన్నారు. తాడేపల్లి టౌన్, తాడేపల్లి రూరల్ మండలానికి చెందిన మహిళలు నిపుణుల పర్యవేక్షణలో శిక్షణ పొందారు. కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు మంగళగిరి ఎమ్మెస్సెస్ భవన్ లో నియోజకవర్గ తెలుగు మహిళలు శనివారం సర్టిఫికెట్లు, కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. 40వ బ్యాచ్‌లో 60 రోజుల పాటు శిక్షణ పొందిన 60 మంది మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. మహిళల అభ్యున్నతి కోసం, వారి జీవనోపాధి కోసం కృషి చేస్తున్న నారా లోకేష్ కు కుట్టుమిషన్లు అందుకున్న లబ్ధిదారులు ధన్యవాదములు తెలియజేశారు. నారా లోకేష్ ఇస్తున్న సహకారం ఎప్పటికీ మర్చిపోలేమని మహిళలు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆరుద్ర భూలక్ష్మి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగలనేదే లక్ష్యంగా నారా లోకేష్ ఉచితంగా కుట్టుమిషన్లు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కుట్టు మిషన్లు అందుకున్న వారు స్వతహాగా ఎదుగుతూ వారి కుటుంబానికి, నారా లోకేష్ గారికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. వైసీపీ నాయకులు ఐదు సంవత్సరాలుగా ప్రజల సమస్యలను పక్కనపెట్టి వనరులను దోచుకోవడంపై దృష్టి చారించారని విమర్శించారు. వైసీపీ ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలు తుంగలో తొక్కారని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని, మహిళలపై మానభంగాలు, దాడులు, దౌర్జన్యాలు, బాలికలపై అఘాయిత్యాలు మితిమీరి పోయాయని ఆవేదన చెందారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలెండర్లు, అమ్మకు వందనం కింద రూ.15వేలు, ఇంట్లోని మహిళలందరికి నెలకు రూ.1500 చొప్పున ఆర్థిక సహాయం అందజేయడంతో పాటు నియోజకవర్గంలోని పేదలందరికీ 20 వేల ఇళ్లు, అసైన్డ్ మరియు ఇతర ప్రభుత్వ స్థలాల్లో నివసిస్తున్న పేదల ఇళ్లను రెగ్యులరైజ్ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య మంచికలపూడి వైష్ణవి, కొయ్యగూర మహాలక్ష్మి, అన్నె కుసుమ, బొర్రా కృష్ణ వందన, తాడేపల్లి మాజీ కౌన్సిలర్ కాటబత్తుని నిర్మల, జంగం జయభారతి, కోడుమూరు ఆదిలక్ష్మి, యం అరుణ తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ బాటలోనే నా అడుగులు



మంగళగిరి, మేజర్ న్యూస్: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ బాటలోనే నా అడుగులు వేస్తానని, వైసిపిని తరమికొట్టటమే లక్ష్యంగా పని చేస్తామని మంగళగిరి నియోజకవర్గ జనసేన ఇన్ చార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఉదయం మంగళగిరి నియోజకవర్గ జనసేన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిల్లపల్లి మాట్లాడుతూ మంగళగిరి లో టిడిపి జనసేన ఉమ్మడి అభ్యర్ధి ని భారీ మెజార్టీతో గెలిపిస్తామని అన్నారు. టిడిపి జనసేన పోత్తులను దెబ్బతీసేందుకే సోషల్ మీడియాలో తప్పుడు కథనాలు వస్తున్నాయని అన్నారు. టిడిపి జనసేన ఉమ్మడి మేనిపేస్టో కలసి ప్రకటిస్తాం అన్నారు. చేనేత టెక్స్ టైల్ పార్క్ , స్వర్ణకార భవన్, ఫెర్టిలైజర్స్ బ్యాంక్ మంగళగిరి కేంద్రంగా తీసుకువచ్చేందుకు నారా లోకేష్ తో కలసి ముందుకు వెళ్తాం అన్నారు. రాష్ట్రంలో టిడిపి జనసేన ఉమ్మడి ప్రభుత్వం వస్తుందని, వైసిపిని ఓడించటమే లక్ష్యంగా పని చేయటానికి మేము సిద్దంగా ఉన్నాం అన్నారు. మాకు నారా లోకేష్ కు అండర్ స్టాండింగ్ ఉంది.. రాష్ట్ర నాయకుడిగా కీలక పాత్ర పోషిస్తున్నారు. జనసేన పార్టీ నీడలో ఉండబట్టే నేను గుర్తించబడ్డాను అన్నారు. విలేకరుల సమావేశంలో బేతపూడి విజయశేఖర్, బడే కొమలి, వాసా శ్రీనివాసరావు సామల నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

# టీడీపీతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ - దామర్ల రాజు

మంగళగిరి, మేజర్ న్యూస్ : భవిష్యత్‌కు గ్యారెంటీ టీడీపీతోనే సాధ్యమని మంగళగిరి పట్టణ అధ్యక్షులు దామర్ల రాజు అన్నారు. మంగళగిరి పట్టణంలోని 10, 11, 12, 13, 14, 16 వార్డులలో శనివారం సాయంత్రం పట్టణ అధ్యక్షులు దామర్ల రాజు ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోలోని విషయాలను నాయకులు ఇంటింటికి వెళ్లి వివరించారు. ప్రజలకు భవిష్యత్తుకు గ్యారెంటీ బాండ్లను అందజేశారు. ఈ సందర్భంగా దామర్ల రాజు మాట్లాడుతూ రాష్ట్రానికి పుర్వవైభవం నారా చంద్రబాబు నాయుడు పాలన



తోనే సాధ్యమన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని విమర్శించారు. వైకాపా పాలనలో అన్నిరంగాలు కుదేలయ్యాయన్నారు. రాష్ట్రాభివృద్ధిని వైసీపీ పదేళ్లు వెనక్కు నెట్టేసిందన్నారు. కొత్త పరిశ్రమలు రాక, ఉన్న పరిశ్రమలు వెళ్లగొట్టడంతో నిరుద్యోగ సమస్య పెరి గిందన్నారు. ఎక్కడ చూసినా అవినీతి కనిపిస్తోం దని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములు విచ్చలవిడిగా కబ్జాలకు గురవు తున్నాయన్నారు. ఇటువంటి దుర్మార్గపు వైసీపీ పాలనకు స్వస్తి పలికేందుకు ప్రజలు సిద్దంగా ఉన్నారని దామర్ల రాజు అన్నారు. కార్యక్రమంలో సంకా బాలాజీ గుప్తా, మాజేటి గోపాలకృష్ణ, గోవాడ దుర్గారావు, షేక్ రియాజ్, అబ్దుల్ మజీద్, బైరబోయిన శ్రీనివాసరావు, మర్రి యేసుబాబు తదితరులు పాల్గొన్నారు.

# రాజధానిలోని తుళ్లూరులో అంగన్వాడీల రాస్తారోకో




తుళ్లూరు మేజర్ న్యూస్ : అంగన్వాడీల ఆందోళన ప్రారంభమై 40 రోజులు గడుస్తున్న పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం దుర్మార్గమని సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం రవి, ఎంభాగ్యరాజు అన్నారు. అంగన్వాడీ టీచర్లు ఆయాలు దళితులు గిరిజనులు బలహీన వర్గాల వారు అధిక శాతం మంది ఉంటే వీరి సమస్యలు పరిష్కరించకుండా వీరిని బెదిరింపులకు గురి చేయటం అంగన్వాడీలపై దుష్ప్రచారాన్ని చేస్తుండటం ఇదోరకం అంటరానితనం కాదా అని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొండివైఖరి వీడి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకపోతే జరిగే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించవలసి వస్తుందని వారు హెచ్చరించారు. రాస్తారోకోలో ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ తుళ్లూరు మండల అధ్యక్ష కార్యదర్శులు స్వర్ణ లత, ఎస్ కే కరీ మూన్ యూనియన్ నాయకులు అన్నామ, రజిని, విజయలక్ష్మి ,శంషాద్ సునీత ,పద్మ, తులసి, సుచరిత, అరుణ సిఐటియు నాయకులు పేరం బాబురావు తదితరులు నాయకత్వం వహించారు.

# కొనసాగుతున్న ప్రీమియర్ లీగ్ -2 పోటీలు



మంగళగిరి, మేజర్ న్యూస్: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకోని నియోజకవర్గ తెలుగు యువత ఆధ్వార్యాన నారా లోకేష్ క్రీడా ప్రాంగణం(భోగి ఎస్టేట్స్)లో జరుగుతున్న మంగళగిరి ప్రీమియర్ లీగ్ -2 పోటీలు గత 12 రోజులుగా నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. క్రికెట్ పోటీలలో నియోజకవర్గ క్రీడాకారులు అద్భుతంగా రాణిస్తున్నారు. 12వ రోజు అయిన శనివారం యూ.సి లెవెన్ వర్సెస్ మహానాడు సైదా హుస్సేన్ మధ్య జరిగిన మ్యాచ్‌లో యూ.సి లెవెన్ జట్టు విజయం సాధించింది. అంబేడ్కర్ ఫాలోయర్స్(ఈమని) వర్సెస్ అన్‌స్టాపబుల్ మధ్య జరిగిన మ్యాచ్‌లో అన్‌స్టాపబుల్ జట్టు, కొత్తపేట లెవెన్ వర్సెస్ ఫ్యాక్టరీ సీసీ జూనియర్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఫ్యాక్టరీ సీసీ జూనియర్స్ జట్టు, నవులూరు లెజెండ్స్ వర్సెస్ రైడర్స్ లెవెన్ మధ్య జరిగిన మ్యాచ్‌లో రైడర్స్ లెవెన్ జట్టు, మహానాడు లెవెన్ వర్సెస్ పెనుమాక వారియర్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో పెనుమాక వారియర్స్ జట్టు, బాష 786 వర్సెస్ యం.ఎ.కె కృష్ణాయపాలెం మధ్య జరిగిన మ్యాచ్‌లో బాష 786 జట్లు గెలుపొందాయి. ఫ్యాక్టరీ సీసీ జూనియర్స్ జట్టులోని క్రీడాకారుడు ఆఫ్ సెంచరీ చేయగా మంగళగిరి పట్టణ తెలుగు యువత అధ్యక్షులు భోగి వినోద్ రూ. రెండు వేల నగదు బహుమతి అందజేశారు. అలాగే ప్రతీ మ్యాచ్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన క్రీడాకారుడికి తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్ చంద్ సహకారంతో రూ.రెండు వేల నగదు బహుమతి, ట్రోఫీ, క్రీడాకారులందరికీ ప్రశంసా పత్రాలను అందజేశారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ. 2 లక్షలను నియోజకవర్గ తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మంచికలపూడి వైష్ణవి మరియు మాలపాటి పుల్లయ్య చౌదరి, ద్వితీయ బహుమతి రూ. లక్షను సీనియర్ నాయకులు ఇట్టా పెంచలయ్య, తృతీయ బహుమతి రూ. 50 వేలను యర్రబాలెం టీడీపీ గ్రామ కమిటీ ఆర్థిక సహకారంతో అందించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

# అయోధ్య రాముల వారి అక్షంతలు పంపిణీ



తుళ్లూరు మేజర్ న్యూస్ : రాజధాని అమరావతిలో అయోధ్య లోని అత్యంత వైభవంగా నిర్మిస్తున్న బాల రాముడు విగ్రహా ప్రతిష్ట మహెూత్సవం పురస్కరించుకొని రాష్ట్ర ప్రజలకు ఆహ్వాన పత్రికలు అందజేసే కార్యక్రమాన్ని నిర్వహించారు శనివారం నాడు మండల కేంద్రం తుళ్లూరులో రామభక్త సమాజం ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి ఆహ్వాన పత్రికతో పాటు అక్షంతలను కూడా భక్త సమాజం అందజేసింది గ్రామంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అయోధ్యకు రావాలని కోరారు

# వ్యాకరణం గాయత్రీ విభావరికి సత్కారం



గుంటూరు (సాంస్కృతికం) మేజర్ న్యూస్ : స్థానిక బృందావన గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై గాయత్రీ మహిళా సంగీత సమ్మండలి ఆధ్వర్యంలో శనివారం సంగీత విద్వాంసురాలు వ్యాకరణం గాయత్రీ విభావరికి గాయత్రీ యువ సంగీత రత్న పురస్కారంతో ఘన సత్కారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభకు సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ పి. విజయ అధ్యక్షత వహించారు. సభలో కేంద్ర ప్రభుత్వ న్యాయవాది జూపుడి వెంకట కుమార్ యజ్ఞదత్త్, విశ్రాంత అధ్యపకురాలు యం.యల్. తులశమ్మ, డాక్టర్ జి. నీలిమ, ప్రదాన కార్యదర్శి యం.వై. శేషరాణి, పాటిబండ్ల లలిత, మాదవపెద్ది విజయలక్ష్మి, మంగాదేవి, మాధవీకృష్ణ లు వ్యాకరణం గాయత్రీ విభావరిని సత్కరించారు. సభానంతరం గాయత్రీ వయెలిన్‌పై పలు కీర్తనలను శ్రావ్యంగా పలికించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. మృదంగంపై యస్.హరిహరన్ వాయిద్య సహకారం అందించారు.

# ప్రజాక్షేత్రంలోకి..
# గురజాల యువ వైద్యుడు



- రానున్న ఎన్నికల్లో పోటీ చేసేందుకు రంగం సిద్ధం
- సామాన్యులకు ప్రధాన పార్టీలు సీటు కేటాయించేనా...?
- రాజకీయాల్లో చేరేందుకు ఉత్సాహం చూపిస్తున్న వైద్యులు
- ఎస్సీ రిజర్వ్ నియోజకవర్గం పోటీ చేసేందుకు వినుకొండ అనిల్ కుమార్ చర్చలు



**అమరావతి, మేజర్ న్యూస్ :** రానున్న సార్వత్రిక ఎన్నికలలో ప్రధాన పార్టీలైన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ, తెలుగుదేశం పార్టీ నుండి పోటీ చేసేందుకు వైద్యులు పెద్ద ఎత్తున కసరత్తు చేస్తున్నారు. గెలుపు గుర్రాలకే టికెట్లు కేటాయించాలని ప్రధాన పార్టీలు అభ్యర్థులు ఎంపికలో తీవ్రంగా కసరత్తు నిర్వహిస్తున్నాయి. అందులో భాగంగా గురజాల నియోజకవర్గంలోని గురజాల పట్టణానికి చెందిన వినుకొండ అనిల్ కుమార్ బాపట్ల జిల్లా పరిధిలోని రెండు ఎస్సీ నియోజకవర్గాలలో ఎక్కడ అయినా పోటీ చేసేందుకు తీవ్రంగా కసురత్తులు చేస్తున్నారు. అందులో భాగంగా ప్రధాన పార్టీలకు చెందిన అగ్ర నాయకులను ఇటీవల కలిసి తనకు సీటు కేటాయించాలని కోరినట్లు సమాచారం.

### పలు ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్న అనిల్

గురజాల నియోజకవర్గంలో పలు ఉద్యమాలలో అనిల్ చురుకుగా పాల్గొని తన గొంతును వినిపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజనకు వ్యతిరేకంగా సమైక్యాంధ్ర ఉద్య మంలో పెద్ద ఎత్తున పాల్గొని సమైక్యాంధ్రకు మద్దతు తెలిపారు. పలు బంద్‌లు, ధర్నాలలో పాల్గొని యువకులలో ఉత్తేజం నింపారు. అలాగే గురజాల కేంద్రంగా పల్నాడు జిల్లా చేయాలని కోరుతూ పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. గురజాల నియోజకవర్గానికి వైద్య కళాశాల మంజూరు అనంతరం పిడుగురాళ్ల మండలంలోని బ్రాహ్మణపల్లిలో మెడికల్ కళాశాలకు నిర్మాణానికి వ్యతిరేకంగా గురజాల కేంద్రంగా మెడికల్ కళాశాల నిర్మించాలని తన గొంతును వినిపించారు. అలాగే పలు సేవ కార్యక్రమాల్లో పాల్గొని తన వంతు సహాయం చేశారు.

### ప్రధాన పార్టీలలో సీటు దక్కేనా...?

గురజాల ప్రాంతం నుండి ఎందరో ప్రధాన పార్టీలకు సేవలందించగా మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, మాజీ డిఐజి చంద్రగిరి ఏసురత్నం, మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి చట్టసభలలో ప్రాతినిధ్యం కల్పించిన గురజాల ప్రాంతం నుండి యువ వైద్యులు వినుకొండ అనిల్‌కుమార్ రాజకీయాలలో చేరి మరింత ఉన్నత శిఖరాలకు చేరాలని గురజాల ప్రాంతానికి చెందిన పలువురు ఆశాభవం వ్యక్తం చేస్తున్నారు. వైద్య వృత్తి, వ్యూహరచనలు, పోరాట పటిమ, వాక్ చతుర్యం కలిగి ఎస్సీ సామాజిక వర్గంలో మంచి గుర్తింపు, ప్రధాన పార్టీలలో పట్టు ఉన్న తన గురువుల ద్వారా అధిష్టానం మెప్పు కొరకు అనిల్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ప్రధాన పార్టీలు వినుకొండ అనిల్ గెలుపు గుర్రం అని భావించి టికెట్ కేటాయిస్తే గురజాల ప్రాతం నుండి ఎస్సీ సామాజిక వర్గం నుంచి ఎన్నికలలో దిగిన రెండో వ్యక్తిగా నిలుస్తారు. అధిష్టానం నుంచి పిలుపు రాగానే బహిరంగంగా బయటికి వస్తారని సమాచారం. రానున్న ఎన్నికల నేపథ్యంలో ఏం జరుగుతుందో చూడాలి మరి.

# టీడీపీ 58వ డివిజన్ సర్వసభ్య సమావేశం

## మాజీ ఎమ్మెల్యే బోండా ఉమా



**విజయవాడ రూరల్, మేజర్ న్యూస్:** సింగ్ నగర్ లోని సెంట్రల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం 58వ డివిజన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు,సెంట్రల్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు బోండా ఉమా మహేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా బోండా ఉమా మాట్లాడుతూ ఎన్నికలు మరొక 80 రోజుల్లో జరగబోతున్నాయని, అందరూ కూడా అప్రమత్తంగా ఉండాలని, ఈ వైసీపీ ప్రభుత్వం ఏదైనా చేస్తుంది కాబట్టి, 58వ డివిజన్ పరిధిలో ఓట్లు సరి చూసుకోవాలని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ, జనసేన ప్రకటించిన మినీ మేనిఫెస్టో, ఆరు పథకాలను ప్రజలకు చేరువయ్యేలా చేయడం, ప్రతినిత్యం ప్రజల్లో ఉంటూ, తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎలా మేలు జరిగిందో,ఈ వైసీపీ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రజలు ఏ విధంగా నష్టపోయిందో,ప్రజలకు ప్రతి ఒక్కరూ వివరించాలని సూచించారు. ఈ నాలుగు సంవత్సరాల తొమ్మి ది నెలల కాలంలో చాలామంది నాయకులు కష్టపడి పని చేశారని, కొంత మంది ఉద్యోగాలు నిమిత్తం, వ్యాపారాలు నిమిత్తం పార్టీకి ఎక్కువ సమయం లో వెచ్చించలేకపోయారని, కానీ ఇప్పుడు కూడా అందరూ ప్రజల్లోనే ఉండాల ని, ఎన్నికలు అయ్యేదాకా తెలుగుదేశం పార్టీ విజయం కోసం నారా చంద్ర బాబు నాయుడుని మరలా ముఖ్యమంత్రిని చేయడం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ వైసీపీ ప్రభుత్వం వచ్చిక నిత్యవసర ధరలు, గ్యాస్ ధరలు,పెట్రోల్ ధరలు, డీజిల్ ధరలు అన్ని రకాలుగా పెంచి, సామాన్యుడిని బతుకును చిన్నాభిన్నం చేశారని, తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిరుపేద లు, సామాన్యులు దిగువ, మధ్య తరగతికి చెందినవారు, వారి కుటుంబంతో చాలా ఆనందంగా గడిపేవారని, ఈరోజు ప్రజలకు తెలుగుదేశం పార్టీ వైసిపి మధ్య వ్యత్యాసం ప్రజలకు చెప్పినట్లయితే, వారే ఎవరికి ఓటు వేయాలో నిర్ణయించుకుంటారని తెలిపారు. ఈ వైసీపీ ప్రభుత్వ విధానాలే ప్రజలకు గుదిబండగా మారాయని, సాఫీగా జరిగిపోయే ఇసుకను ఆపి, కొత్త విధానాన్ని ప్రవేశ పెట్టడం ద్వారా, లక్షలాదిమంది భవన నిర్మాణ కార్మికులు ఈరోజు అర్ధాకలితో అలమటిస్తున్నారని, ఈ జగన్మోహన్ రెడ్డి జాబ్ క్యాలెండర్ను ప్రకటిస్తామని చెప్పి, నిరుద్యోగులను విద్యార్థులను నిట్టనినువుల మూసగుంచారని, అన్నా క్యాంటీన్‌ను ఎత్తివేసి బీద, బడుగు, బలహీన చిరు వ్యాపారులకు మధ్యాహ్నం భోజనం లేకుండా చేశారని, సమాజంలో అన్ని వ్యవస్థల మీద, అందరి వ్యక్తుల మీద అన్ని వర్గాల మీద దెబ్బ కొట్టినదని, ఈ వైసీపీ ప్రభుత్వమని దుయ్యబట్టారు. కాబట్టి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం చారిత్రాత్మక అవసరమని, నారా చంద్రబాబు పాలనతో మరల తిరిగి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పాత రోజులు తిరిగి వస్తాయని, ఈ విషయాన్ని క్షేత్రస్థాయిలో అందరికీ వివరించాలని రాబోయేది తెలుగుదేశం, జనసేన కోటమీదేనని చాటి చెప్పాలని తెలిపారు. డివిజన్ పరిధిలో, నియోజకవర్గ పరిధిలో జనసేన నాయకులు, కార్యకర్తలతో కలిసి పని చేయాలని సూచించారు. ఈనెల 22న కొత్త ఓటర్ లిస్ట్ రాబోతుందని, ప్రజల్లోకి వెళ్లి ఓట్లు ఉన్నవో,లేవో చూసి,వారి బాధ్యతను వారికి గుర్తుచేయాలని, ఎన్నికలకు వారం రోజులు ముందు వరకు కూడా కొత్తగా ఓటు హక్కును నమోదు చేసుకునే అవకాశం ఎలక్షన్ కమిషన్ కల్పించిందని తెలిపారు. ఇకనుండి ప్రతి 15 రోజులకు ఒకసారి డివిజన్ మీటింగులు జరుగుతుయని, డివిజన్ మీటింగ్లో ఆ పదిహేను రోజులకు జరిగిన పరిణామాలను చర్చించుకుందామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు అలా తారక రామారావు, ఇన్చార్జి సోమేశ్వరరావు, కృష్ణమోహన్, అమర్ నాథ్ గౌడ్, రామరావు, గౌస్, జనసేన డివిజన్ నాయకురాలు విజయ, సుల్తాన పాల్గొన్నారు.



## "డాక్టరేట్" బిరుదాంకితునకు ఘన సన్మానం

**పెడన, మేజర్ న్యూస్ :** డాక్టరేట్ బిరుదాంకితుడు కుర్మా శంకర్ రావు కు ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం, కృష్ణా జిల్లా చేనేత కార్మిక సంఘం, వివిధ సంఘాలు ఘనంగా సత్కరించాయి. ఈ మేరకు ఈ కార్యక్రమం మంగళగిరి మార్కండేయ కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర 13 మహాసభల్లో పెడన పట్టణానికి చెందిన గౌరవ డాక్టరేట్ కుర్మా శంకర రావు కు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శంకరరావు పెడన సిపిఐ కార్యదర్శి దివంగత కుర్మా కోటేశ్వరరావు ప్రథమ కుమారుడు అని అన్నారు. అంతేకాక డాక్టరేట్ బిరుదునకు ఇటువంటి సన్మానం తమ అందరి మధ్య చేయడం ఎంతో ఆనందదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సిపిఐ సహాయ కార్యదర్శి జె.వి సత్యనారాయణమూర్తి, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టా. హేమ సుందర్ రావు, ఆల్ ఇండియా వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బండారు ఆనంద ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బత్తురి మోహనరావు,ఉప ప్రధాన కార్యదర్శి పెండెం శివరామకృష్ణ తదితరులు ఉన్నారు.

# సీనియర్ వైసీపీ నేత ఆళ్ల కాంగ్రెస్ పార్టీలో చేరిక



తుళ్లూరు మేజర్ న్యూస్ : రాజధాని తుళ్లూరు ప్రాంతంలోని వడ్డమాను గ్రామానికి చెందిన ఆళ్ల బసవ పూర్ణచంద్రరావు వైయస్ షర్మిల ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు ఈ మేరకు శనివారం విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ షర్మిల ఆధ్వర్యంలో నూతన ఉత్తేజాన్ని నింపుకుంటుందని కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు వైయస్సార్సీపి కి రాజీనామా చేసి కాంగ్రెస్లో చేరుతున్నట్లు తెలిపారు. 2013 నుండి కాంగ్రెస్ నుండి వైసిపికి వచ్చి 2014, 2019 తాడికొండ నియోజకవర్గం ఎన్నికల కాంపెయిన్ ఇంచార్జ్ గా పనిచేశానన్నారు మర్రి రాజశేఖర్ శిష్యుడిగా 2014 నుండి ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడిగా,గుంటూరు జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడిగా,5 గురు జిల్లా అధ్యక్షులతో( మర్రి రాజశేఖర్,రావి వెంకట రమణ, అప్పిరెడ్డి,మేకతోటి సుచరిత, డొక్కా )కలిసి ఇప్పటి వరకు పని చేశానుఅని చెప్పారు, 2019 లో పార్టీ పెద్దల సూచన మేరకు ఉండవల్లి శ్రీదేవి నీ పార్టీ కీ పరిచయం చేయటం, టికెట్ ఇప్పించే విషయం లోనూ, ఎన్నికల లో గెలుపు కీ కృషి చేసిన విషయంలోనూ, మంగళగిరి, ప్రత్తిపాడు నియోజకవర్గం లలో కీలకం గా పని చేయటం జరిగింది, అని వివరించారు షర్మిల పిసిసి అధ్యక్షురాలుగా ఎంపిక కావడం కాంగ్రెస్ బలోపేతం అవుతుందని ఆశాభవాన్ని వ్యక్తం చేశారు సామాజిక న్యాయం కాంగ్రెస్ లోనే జరుగుతుందని భావించి తిరిగి సొంత నూటికి చేరినట్లు వెల్లడించారు.

# సింగు గ్రూప్ సంస్థ అంధలకు నిత్యావసరాలు పంపిణి




గుంటూరు, మేజర్ న్యూస్ : అనాదిగా సమాజ సేవ అనేది ఒక పవిత్ర కార్యంగా భావించ బడుతుంది. గుంటూరు అరండల్ పేట, 15 వ లైన్ నందు ఉన్న ప్రముఖ వ్యాపార సంస్థ – సింగు గ్రూప్ అఫ్ కంపెనీస్ వారు తమ సంస్థ 14 వ వార్షికోత్సవం సందర్భంగా సామజిక సేవ కార్యక్రమాలలో భాగంగా గుంటూరు బ్రోడిపేట, 2/13 నందు వున్న శ్రీ షిరిడీ సాయి దీనజన సేవ సమితి ( అంధ, వికలాంగుల పాఠశాల ) వారికి బియ్యము, నిత్యావసర వస్తువులు, కూరగాయలు మరియు స్వీట్స్ అందజేశారు. ఈ సందర్భంగా సింగు గ్రూప్ అధినేత శ్రీ సింగు రత్న కిషోర్ గారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తాము ఇటువంటి సామజిక సేవ కార్యక్రమాలు చేపడుతున్నాము అని తెలిపారు. విద్యార్థులు కూడా భవిష్యత్తు లొ ఉన్నతస్థాయి కి చేరిన తరువాత ఇటువంటి కార్యక్రమాలు చేపట్టాలి అని, మన ఉన్నతికి కారణమయనవరిని మరువరాదు అన్నారు. అర్హులైన వారికి తమ సంస్థ ద్వారా ఉద్యోగాలు కల్పించడానికి తాము సిద్ధంగా ఉన్నాముని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యంవారు, సింగు గ్రూప్ అఫ్ కంపెనీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ తూములో గుర్తుతెలియని మృతదేహం

తుళ్లూరు మేజర్ న్యూస్ : రాజధాని అమరావతిలోని రాజధాని నిర్మాణం కోసం నిల్వ ఉంచిన డ్రైనేజీ తూములో గుర్తు తెలియని మృతదేహం లభ్యమయింది శనివారం స్థానికుల అందించిన సమాచారం మేరకు రాయపూడి తుళ్లూరు మధ్యలో నిర్మిస్తున్న సీడ్ యాక్సిస్ రోడ్డు కొనసాందానా రోడ్ లో మృతదేహం ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందించారు తక్షణమే తుళ్లూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు అతనితోపాటు ఏపీ 07%వట%3438 అనే నెంబర్ గల ద్విచక్ర వాహనం కూడా ఉన్నట్టు పోలీసులు తెలిపారు అనుమానాస్పద స్థితి మృతి కేసుగా నమోదు చేసినట్లు తుళ్లూరు సిఐ ఆనందరావు తెలిపారు

# తెలుగుదేశం పార్టీ ఎదుగుదలను చూసి ఓర్వలేకే తనపై తప్పుడు అసత్య ప్రచారాలు చేస్తున్నారు



పొన్నూరు మేజర్ న్యూస్ : తెలుగుదేశం జనసేన పార్టీలా పొత్తు ఖరారు అయినప్పటినుండి అధికార వైసీపీ పార్టీ నేతల వెన్నులో వణుకు మొదలైందని, కులమతాల మధ్య చిచ్చుపెట్టి ప్రజలలో విద్వేషాలు రెచ్చగొట్టాలని చూస్తున్నారని తనపై సోషల్ మీడియాలో అంబేద్కర్ గారి విగ్రహాన్ని కూల్చి వేస్తామంటూ దుష్ప్రచారం చేస్తున్న వారిని వదిలేసే లేదని మాజీ ఎమ్మెల్యే సంఘం డైరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ దుయ్యబట్టారు. తనపై అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ శనివారం పొన్నూరు రూరల్ పోలీస్ స్టేషన్లో ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు అధికారం కోల్పోతా మని దుష్ప్రచారాలకు పాల్పడు తున్నారని, అసత్య ప్రచారాల వెనుక వైసిపి నాయకుల హస్తం ఉందని ఆయన పేర్కొన్నారు. దళి తలను అడ్డుపెట్టు కొని ముఖ్య మంత్రి అధికారం పొందాలని చూస్తున్నారని, అంబేద్కర్ గారి ఆశ యాలను తుంగలో తొక్కేశారని ఆయన అన్నారు. ఉద్యోగాలు నడిరోడ్డు లో అమ్ము కున్న ఘనత అధికార పార్టీ నాయకుల దేనని, దళితులు ఆర్థికంగా ముందుకు వెళ్లకుండా అణగదోకుతున్న ది జగన్మో హన్ రెడ్డి అని దూళిపాళ్ల విమర్శించారు. తనపై చేస్తున్న దుష్ప్రచారం వెనుక మంత్రి సిదిరి అప్పలరాజు పిఆర్వో, ఎమ్మెల్యేల పిఏలు,వైకాపా నాయకులు ఉన్నారని పేర్కొన్నారు. ఉద్దేశపూర్వ కంగా చేస్తున్న ఈ కుట్ర వెనుక ఉన్న వారిపై పోలీసులు చర్యలు తీసుకో వాలని కంప్లైంట్ చేశామని లేనిపక్షంలో న్యాయ పోరాటానికైనా సిద్ధమని అన్నారు. ఈ కార్యక్రమ ములో పొన్నూరు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్య క్షులు పఠాన్ అహ్మద్ ఖాన్, నిడుబ్రోలు గ్రామ పార్టీ అధ్యక్షులు జాగర్లమూడి సుధీర్, పొన్నూరు మండల పార్టీ అధ్యక్షులు బండ్లమూడి బాబురావు, చేబ్రోలు మం డల పార్టీ అధ్యక్షులు మైలా వెంకట రామరాజు, పొన్నూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎద్దు సోంబాబు, పున్నూరు నియోజకవ ర్గం మైనార్టీ సెల్ అధ్యక్షులు పఠాన్ ఫిరోజ్ ఖాన్, పొన్నూరు నియోజకవర్గం పోల్ మేనేజ్మెంట్ కోఆర్డినేటర్ మాదాల వెంకటేశ్వరరావు, గుంటూ రు జిల్లా రైతు విభాగ ప్రధాన కార్యదర్శి బొర్రు రామారావు, మాజీ కౌన్సిలర్లు ఆకుల సాంబశివరా వు, తానికొండ లక్ష్మీనారాయణ చౌదరి, సిలార్ భాష, పిన్నమనేని కోటేశ్వరరావు, అనిశెట్టి వీరబా బు, మహమ్మద్ గౌస్, తోట ప్రసాదు, బాబు, నాయకులు బాజీ సాహెబ్, తోట శీను, రాజేష్, విజయ్, సందీప్, కరిముల్లా బాజీ, శోభరాజ్, బెనర్జీ, లాడెన్, మల్లంపాటి వాసు, అబ్రహం, సుజన్, శ్రీకాంత్, సొపాటి వెంకటరావు, సామ్రా జ్యం, బుడ్డా వెంకట శివమ్మ, గోవతోటి ఝాన్సీ ఏసుదయమ్మ, ఆశీర్వాదం, సంజు, పండు, సుభాని, వినోద్, దాసరి సాంబశివరావు, వాసిరెడ్డి శివలింగ ప్రసాద్, నిమ్మగడ్డ ధర్మారావు, దిలీప్, రాధాకృష్ణ, చిల్కా రవి, మధు, వెంకటేష్, ఉమా, వేణు, హేమంత్, పొన్నగంటి వాసు, అనిల్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# జంపాల కుసుమ కుమారిని కలిసిన జే. వంశీకృష్ణ

దుగ్గిరాల, మేజర్ న్యూస్ : అలనాటి సినీ తార సినీ హీరోయిన్ జమున కుమారుడు జె .వంశీకృష్ణ కుటుంబం దుగ్గిరాల గ్రామంలోని జంపాల కుసుమకుమారి స్వగృహమును శనివారం సందర్శించారు. అందాల తార తారగా వెలుగొంది పలు ప్రముఖ చిత్రాలలో హీరోయిన్ గా నటించిన జమున చిన్ననాటి స్నేహితురాలు గ్రామానికి చెందిన సాంఘిక సేవకురాలు ,డ్వాక్రా మహిళ మండలి అధ్యక్షురాలు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకురాలు జంపాల కుసుమ కుమారి ఇంటికి వచ్చి కుశల ప్రశ్నలు వేసుకున్నారు. హీరోయిన్ జమున చిన్నతనంలో తన బాల్య స్నేహితురాలైన జంపాల కుసుమ కుమారితో కలిసి నడిచి. విద్యాభ్యాసం చేశారని ,జమున కుమారుడు వంశీకృష్ణ వివరించారు .చదువుతోపాటు ఆటలు ,పాటలు, నృత్యం ను అద్భుతంగా నటించారని తన



తల్లి జమున చిన్ననాటి రోజులను బాల్య స్నేహితురాలు కుసుమ కుమా రితో కలిసి పంచుకున్నారు. జమున జ్ఞాపకాలను మరొకసారి గుర్తు చేసుకుంటూ తన మనవడుకు వివరించారు. వంశీకృష్ణ. వృత్తి రీత్యా ప్రొఫెసర్ గా పని చేస్తూ పేరొందిన రచయితగా కొనసాగుతున్నార అన్నారు .ఒక తరం నుండి మరొక తరమునకు వేగంగా మార్పులు జరుగుతున్నాయని వంశీకృష్ణ అన్నారు .ఫోన్స్ వాట్సప్ ,ఇన్స్టాగ్రామ్ తదితర వాటి వలన జనరేషన్స్లో బ్రేక్స్ జరుగుతున్నాయన్నారు. తద్వారా విద్యార్థులు. మంచి మార్గం లో నడవలేక డిప్రెషన్ ,మెంటల్ హెల్త్ కు లోనవుతున్నారన్నారు .యువత ప్రపంచాన్ని మంచి మార్గంలో నడపాలని, మంచి మార్గం చూపించాలని కోరారు .వంశీకృష్ణ తో పాటు కుసుమ కుమారి కలసి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ, పలు ప్రదేశాలను క.లియ తిరిగి ఆనాటి జ్ఞాపకాలను కుమారుడు వంశీకృష్ణకు సవివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో వంశీకృష్ణ కుటుంబంతో పాటు జంపాల కుసుమకుమారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణ పై వాహనదారులు అవగాహన కలిగి ఉండాలి



గుంటూరు జిల్లా, నేటి దినపత్రిక సూర్య బ్యూరో : జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు భద్రత నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించటంతో పాటు, నిబంధనలు ఉల్లంఘించే వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి రవాణా, పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం కలక్టరేట్ లోని వీసీ సమావేశ మందిరంలో జరిగిన జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి రాజ కుమారి తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు జనవరి 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 19వ తేది వరకు నిర్వహిస్తున్న నేపథ్యంలో రహదారి భద్రత నిబంధనలపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కలిగేలా ప్రచార కార్యక్రమాలతో పాటు, విద్యాసంస్థల్లో, ఇతర ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించాలన్నారు. కళాశాలలోని ఎన్ఎస్ఎస్, ఎన్ సీ సీ విద్యా ర్థులకు, స్వచ్ఛంధ సేవా సంస్థల ప్రతినిధులకు రహదారి భద్రత నిబం ధనలపై అవగాహన కోసం శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి, వారి ద్వారా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రహదారి భద్రత నిబంధనలు ఉల్లంఘించే వారిని గుర్తించేందుకు రవాణా, పోలీస్ శాఖలు సంయుక్తంగా నిరంతరం తనిఖీలు నిర్వహించాలన్నారు. కంకరగుంట ఓవర్ బ్రిడ్జ్ కి ఇరువైపుల రహదారి ప్రమాదాలను నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పోలీస్, రవాణా, ఆర్ అండ్ బి అధికారులు సంయుక్తంగా పరిశీలన చేసి నివేదిక అందించాలన్నారు. నగరంలోకి కాంట్రాక్టు క్యారేజీ బస్సులు ప్రవేశించకుండా బుడంపాడు, ఆటోనగర్ వై జంక్షన్ వద్ద నిలుపుదల చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ఆటోలను క్రమబద్దీకరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశం అనంతరం కలెక్టరేట్ ఆవరణలో 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు సందర్భంగా రహదారి భద్రతా నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించటానికి రూపొందించిన ప్రచారం పోస్టర్లు, కర పత్రాలను జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి ఆవిష్కరించి, ప్రచార వాహనంను జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రాంతీయ సంయుక్త రవాణా కమిషనర్ కృష్ణవేణి, జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్. కరీం, ఆర్ అండ్ బి ఎస్.ఈ ఆర్ శ్రీనివాస మూర్తి, ఎన్ హెచ్ ఏ ఐ పీడీ పి. పార్వతీశం , డి యం అండ్ హెచ్ ఓ డా. విజయలక్ష్మీ, తెనాలి ఆర్టీఓ ప్రసాదు,ఆర్టీసీ ఆర్ఎం రవికాంత్, ట్రాఫిక్ డీఎస్పీ బాల సుందరం , నగరపాలక సంస్థ ఎస్.ఈ సుందరరామిరెడ్డి పాల్గొన్నారు.

## శ్రీవిజయ వనమలమ్మ 107వ వార్షిక జాతర మహోత్సవం



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** మచిలీపట్నం నిజాంపేటలో వేంచేసియున్న విజయ వనమలమ్మ 107వ జాతర మహోత్సవములు శనివారం నుంచి మూడు రోజులపాటు జరుగుతాయని ఆలయ నిర్వహకులు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ 1918లో ఊరిలో కలరా మసూచి మొదలైంది అంటువ్యాధులు ప్రబలినప్పుడు అమ్మవారు కలలో కనిపించి జాతర జరిపించమని కోరారు ఆనాటి నుండి మకర సంక్రాంతి జరిగిన తర్వాత వచ్చే ఆదివారం నాడు జాతర వైభవంగా ప్రతి సంవత్సరంజరుగుతుందని ఈ సందర్భంగా భక్తులు తమ యొక్క ముడుపులు మొక్కుబడులు చెల్లించుకుంటారని జాతర ముందు రోజు అమ్మవారు నగర ప్రవేశం చేసి పురవీధుల్లో ఊరేగుతారని తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పాలుపంచుకోవాలి అని ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు. దేవాలయం అభివృద్ధి చెందడానికి కొండ రాతి స్తంభాలతో కొత్త దేవాలయం అభివృద్ధి పరుస్తున్నామని అది కూడా త్వరలోనే పూర్తవుతుందని అన్నారు. ఈ రోజు పూజలో కూర్చున్న దంపతులు, మిరియాల రామకృష్ణ, అమ్మాజీ, మస్తాన్ శే శేషాశయన్, ధనలక్ష్మి, శీలం బాబ్జి, పట్టణ డిప్యూటీ మేయర్, భారతి, పొన్నూరి శ్రీనివాస రావు, సీత మహాలక్ష్మి, నరహరి శెట్టి కనకదుర్గ ప్రసాద్, విజయలక్ష్మి, విన్నకోట వన ప్రభాకర్, శైలజ దంపతులు చే పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో సుహాసినీలు లలితా పారాయణం పాడారు, వారి అందరికీ అమ్మవారి చీరల ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమానికి భక్తులు వారి సహకరించిలోకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు, విన్నకోట వన ప్రభాకర్ తెలియజేశారు.

## సీపీఐ రామకృష్ణ వ్యాఖ్యలను ఖండించిన ఎమ్మెల్సీ అరుణ్



**నందిగామ, జనవరి 20, మేజర్ న్యూస్:** సిపిఐ రామకృష్ణ వ్యాఖ్యలను ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ ఖండించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాకు నిజంగా అభినయ అంబేద్కర్ అని అన్నారు. సిపిఐ రామకృష్ణ పెత్తందారి లాగా కుల అహంకారంతో మాట్లాడుతున్నారు. అంబేద్కర్ పేద బడుగు బలహీన వర్గాల కోసం ఏ విధంగా పాటుపడ్డారో అదే విధంగా సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పని చేస్తున్నారు. అందువల్లనే సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని అభినవ అంబేద్కర్ అనడం జరిగింది. ప్రతి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అణగారిన వర్గాల జీవితాల్లో వెలుగులు చూపిన ఘనత సీఎం జగన్మోహన్ రెడ్డికే దక్కుతుంది. సిపిఐ రామకృష్ణ తన పెత్తందారి పోకర్లను సిపిఐ ముసుగులో చంద్రబాబు నాయుడుకి పనిచేస్తున్నారు అన్నారు.

## అంగన్‌వాడీ నిరసనలు 40వ రోజు కొనసాగాయి



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** అంగన్‌వాడీలు వారి న్యాయమైన కొర్కెలు, హామీలను పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న నిరసనలు శనివారం 40 వ రోజుకు చేరాయి. ఐసిడిఎస్ కార్యాలయం వద్ద చేస్తున్న నిరసనలకు తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు, జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వర రావు, జిల్లా ఎస్.సి సెల్ నాయకులు ఎం ఆదినారాయణరావు, సీనియర్ నాయకులు మండలి రాంమోహన్‌రావులతో పాటు పలువురు దీక్షా శిబిరాన్ని సందర్శించి అంగన్‌వాడీలకు సంఘీభావం తెలిపారు. గత 40 రోజులుగా అంగన్‌వాడీలు రోడ్లపై నిరసనలు తెలియచేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వానికి కనిపించడం లేదా అన్నారు. 2019 ఎన్నికల ముందు జగన్‌మోహణ్ రెడ్డి అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్‌తో పాటు అన్ని హామీలను నెరవేర్చాలన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలకు కృష్ణాజిల్లా అంగన్‌వాడీ సంఘ అధ్యక్షురాలు నిర్మలా జ్యోతి ఆద్వర్యంలో ఐసిడిఎస్ పరిధిలోని అంగన్‌వాడీలు, ఆయాలు పెద్ద ఎత్తున నిరసనలో పాల్గొన్నారు.

## శ్రీ రామ కళ్యాణంకు ఆహ్వానం



మచిలీపట్నం, మేజర్‌న్యూస్ : ఈ నెల 22 అయోధ్య లో రామ మందిరం ప్రారంభం సందర్భంగా కోనేరు సెంటర్ లో జరిగే శ్రీ రామ కళ్యాణంకు మచిలీపట్నం నియోజకవర్గం ఇంచార్జి పేర్ని కృష్ణమూర్తి ని హిందూ ఐక్య వేదిక సభ్యులు ఆహ్వానం అందజేశారు.

# అధికారుల అలసత్వంతో వికసిత భారత్ సంకల్ప యాత్ర



**నందిగామ, జనవరి 20, మేజర్ న్యూస్ :** అధికారుల అలసత్వం తో నిర్వీర్యం అవుతున్న వికసిత భారత్ సంకల్ప యాత్ర నిర్వీరం అవుతుందని బిజెపి నాయకులు అన్నారు. శనివారం ప్రకటనలో తెలుపుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దేశ వ్యాప్తంగా జరుగుతున్న వికసిత భారత్ సంకల్ప యాత్ర ఆంధ్రప్రదేశ్ లో నిర్వహించడం జరుగుతుంది. ఈ క్రమంలో నందిగామ పట్టణంలో అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. అయితే ఈ కార్యక్రమం అధికారుల అలసత్వం తో కేవలం నామమాత్రంగా జరిపించడంపై పట్టణ బిజెపి నాయకులు అసహనం వ్యక్తం చేశారు. ఈ వికసిత భారత్ సంకల్ప యాత్ర కేవలం ప్రజలు లేకుండా కుర్చీలకి మాత్రమే సంకల్ప యాత్ర నిర్వహించి మ,,మ అనిపించిన నందిగామ పట్టణ మున్సిపల్ అధికారులు, అయితే కేంద్ర ప్రభుత్వ నిధులు, కేంద్ర ప్రభుత్వ పథకాల తో పబ్బం గడుపునే మున్సిపల్ అధికారులు వికసిత యాత్ర పై బాధ్యతా రాహిత్యం గా ప్రవర్తించడం పై బిజెపి నియోజక వర్గ కన్వీనర్ సీతారామయ్య విచారం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చివరి లబ్ధిదారుల వరకు పథకాలు అందాలన్న సదుద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కానీ ఇక్కడ ఉన్నటువంటి అధికారులు కనీసం దానిపై పట్టణ ప్రజల్లో అవగాహన కల్పించకపోగా (ఆయుష్మాన్ భారత్ కార్డులు గాని. గ్యాస్ కలెక్షన్స్ తో పాటు ఇతర కేంద్ర ప్రభుత్వ పథకాలు) కనీస ఏర్పాట్లు చేయకపోవడం పై ఆ పార్టీ స్పోక్స్ పర్సన్ కేదార్నాథ్ తీవ్రంగా విమర్శించారు. ఈ రోజు జరిపిన వికసిత భారత్ యాత్ర పై అలసత్వం వహించిన అధికారులు మరొక రోజు విజయవంతంగా నిర్వహించాలని ఆ పార్టీ నాయకులు ముక్కపాటి నరసింహారావు కోరారు. ఈ కార్యక్రమంలో. సుందరరావు, వెంకటరావు, కొండ, శ్రీనివాసరావు మొదలైన వారు పాల్గొన్నారు



## అంగన్వాడీల దీక్షలకు మద్దతుగా నేతల ఆందోళన

**చల్లపల్లి మేజర్ న్యూస్ :** దీర్ఘకాలంగా సమ్మెచేస్తున్న అంగన్వాడీ కార్యకర్తల సమ్మె..దీక్షలకు మద్దతుగా చల్లపల్లిలో అఖిలపక్ష నేతలు శనివారం ఆందోళన చేపట్టారు. అంగన్వాడీ కార్యకర్తల పట్ల ప్రభుత్వం తన విధానాన్ని మార్చుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక బస్టాండ్ సెంటర్ లో అఖిలపక్ష నేతలు రాస్తారోకో చేపట్టారు. సమస్యల పరిష్కారం అయ్యే వరకు దీక్షలు విరమించేది లేదనీ, అంగన్వాడీ కార్యకర్తలకు తమ మద్దతు ఉంటుందని నేతలు స్పష్టం చేశారు. రాస్తారోకోతో ట్రాఫిక్ నిలిచిపోగా, చల్లపల్లి ఎస్ఐ. సిహెచ్.చిన్నబాబు ఆందోళన జరుగుతున్న ప్రదేశానికి వచ్చి రాస్తారోకో విరమింపచేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం. పోలినాయుడు, వివిధ పార్టీల నేతలు యద్దనపూడి మధు, పైడిపాముల కృష్ణకుమారి, మోర్ల రాంబాబు, మల్లుపెద్ది రత్నకుమారి, పరుచూరి జనార్ధన్, చాట్రగడ్డ సుధీర్, మహమ్మద్ కరీముల్లా, వెనిగళ్ల వసంతరావు, బండి ఆదిశేషు, షేక్ నబీఘోరి, ఆటో యూనియన్ నాయకులు తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

**చల్లపల్లిలో ఉచిత మెగా వైద్యశిబిరం**



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** చల్లపల్లి లయన్స్ క్లబ్ సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎంపీడీవో సిహెచ్.చినరాట్నాలు అన్నారు. శనివారం స్థానిక లయన్స్ మల్టీపర్పస్ సర్వీస్ సెంటర్లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వంశీ హార్ట్ కేర్ సెంటర్.. హెచ్సీజీ క్యాన్సర్ సెంటర్ వారిచే ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఎంపీడీవో చినరాట్నాలు, డాక్టర్ పవన్కుమార్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, లయన్ల క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. శిబిరంలో డాక్టర్ ఎం.గోపీచంద్, డాక్టర్ కె. వంశీకృష్ణ, డాక్టర్ రావెళ్ల కీర్తిక, డాక్టర్ తుంగల పవన్కుమార్లు వైద్యసేవలందించారు. 90 మందికి గుండె.. క్యాన్సర్ సంబంధిత పరీక్షలు, 54మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి 15మందిని ఐఓఎల్ శస్త్రచికిత్సలకు ఎంపికచేశారు. క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మోపిదేవి వెంకటేశ్వరరావు, రాయపాటి రాధాకృష్ణ, క్లబ్ ప్రతినిధులు నర్రా సాయిబాబు, ముమ్మనేని నాని పాల్గొన్నారు.

## పంచాయతీ ఖాతాకు జమ అయిన రూ.5.25 లక్షలు



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా ఎస్పీ పి. జాషువా చొరవతో చల్లపల్లి గ్రామ పంచాయతీకి పాత బకాయి తీరింది. చల్లపల్లి గ్రామంలోని పోలీస్ సిబ్బంది క్వార్టర్స్, ఎస్ఐ క్వార్టర్, పోలీస్ స్టేషన్లలం ఇంటి పన్ను, నీటికుళయి ఫీజులు 1997-98 ఆర్థిక సంవత్సరం నుంచీ 2022-23 సంవత్సరం వరకు పేరుకున్న బకాయిలు రూ.5.25లక్షల 765లు జిల్లా ఎస్పీ చొరవతో గ్రామ పంచాయతీ ఖాతాకు జమఅయ్యాయి. దాదాపు 25ఏళ్ల బకాయిలు ఒకేసారి చెల్లింపు జరిగేందుకు కృషిచేసిన జిల్లా ఎస్పీ పి. జాషువాకు, అవనిగడ్డ డీఎస్పీ పి.మురళీధర్, చల్లపల్లి సీఐ సిహెచ్.నాగప్రసాద్, ఎస్ఐ సిహెచ్. చిన్నబాబులకు చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, కార్యదర్శి పివి. మాధవేంద్ర రావులు ధన్యవాదాలు తెలిపారు.

## శోభాయాత్రను జయప్రదం చేయండి



**చల్లపల్లి- మేజర్ న్యూస్ :** అయోధ్య శ్రీరామ మందిరంలోని శ్రీబాలరాముని (రామ్లల్లా) విగ్రహ ప్రాణప్రతిష్టా మహొత్సవం సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా జరిగే వేడుకల్లో భాగంగా చల్లపల్లి శ్రీఆర్యవైశ్య సంఘం వారి ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీ సోమవారం శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు చల్లపల్లి శ్రీఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు తెలిపారు. శనివారం స్థానిక శ్రీ ఆర్యవైశ్య భవనంలో సంఘ ప్రతినిధులు వరదా హరిగోపాల్, కొల్లిపర మధు, గోళ్ల ద్రోణపూర్ణచంద్రరావు, జల్లూరు ప్రసాద్లు కార్యక్రమ వివరాలను తెలియచేశారు. సోమవారం ఉదయం గం.9.30లకు శోభాయాత్ర పొట్టి శ్రీరాములు వీధిలోని శ్రీఆర్యవైశ్య సంఘ భవనం నుంచీ ప్రారంభమై మునసబు వీధి, ప్రధాన రహదారి మీదుగా పెదకళ్లేపల్లి రోడ్డులోని శ్రీకన్యకా పరమేశ్వరీ ఆర్యవైశ్య కళ్యాణమండపం వరకు కొనసాగుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలతో సీతారామ లక్ష్మణ హనుమ విగ్రహాలను పల్లకీసేవతో మంగళవాయిద్యాలతో తీన్మార్, డప్పులతో శోభాయమానంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 11గంటలకు శ్రీరామ జయరామ జయ జయ రామ అనే జయమంత్రంము 108 సార్లు జపించటం, హనుమాన్ చాలీసా, సుందరకాండ, రామరక్షా స్తోత్రం, సామూహిక పారాయణ జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 12.32 నిముషాలకు ప్రాణ ప్రతిష్ట సమయమున స్వామివారికి కర్పూర హారతి, శంఖనాదము, ఘంటా నాదము అనంతరం తీర్థప్రసాదం వినియోగం జరుగుతుందన్నారు. ఈ శోభాయాత్రలో హిందు బంధువులు అందరూ పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా విజ్ఞప్తిచేశారు.

# బీసీల ద్రోహి సీఎం జగన్

## మాజీ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య



**కంచికచర్ల జనవరి 20 మేజర్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బీసీల ద్రోహి అని నందిగామ మాజీ శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య ఆరోపించారు. మండల దేశం పార్టీ అధ్యక్షులు కోగంటి బాబు ఆధ్వర్యంలో స్థానిక టిడిపి పార్టీ కార్యాలయంలో మండల జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నందిగామ మాజీ శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీసీలను రాజకీయంగా పైకి తెచ్చిన ఘనత స్వర్గీయ నందమూరి తారక రామారావు చంద్రబాబునాయుడు దేనని తెలిపారు. బీసీ కులాల కు జగన్ రెడ్డి వెన్నుపోటు పొడిచారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 25 ఏళ్లుగా 34% బీసీలకు ఉన్న రిజర్వేషన్లను జగన్ అధికారంలోకి వచ్చాక 10% కోత విధించారని ఆమె అన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక బీసీ నాయకులపై దాడులు సైతం జరిగాయి అన్నారు. అన్ని కులాల వర్గాలకు సమన్యాయం చేసిన ఘనత టిడిపి పార్టీకి దక్కిందన్నారు. కక్ష పూరిత రాజకీయాలతో బీసీలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చాక వెంటనే బీసీలకు రక్షణ చట్టం అమలులోకి తీసుకొస్తామన్నారు. రాష్ట్రబీసీ ఫెడరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి మాట్లాడుతూ ఆనాడు చంద్రబాబు నాయుడు బిసి కార్పొరేషన్ ద్వారా ఎందరికో చేయూతనిచ్చారని అన్నారు . బిసికార్పొరేషన్లను నిర్వీర్యం చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్ కి దక్కిందన్నారు. ఈ వైసీపీ ప్రభుత్వం బీసీ లను అనగా తొక్కుతుందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఉన్న బీసీలంతా ఐక్యమత్యంతో రేపు రాబోవు ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రి చేసేందుకు సమయత్వంకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి మనబోతుల శ్రీరామ్ కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి వల్లూరు మధుసూదనరావు రాష్ట్ర బీసీ సెల్ నాయకులు బేతు శ్రీనివాసరావు వీసం జగదీష్ రాష్ట్రబీసీ సెల్ కార్యదర్శి అల్లాడి కోటేశ్వరరావు నందిగామ టిడిపి మండల అధ్యక్షులు వీరంకి వీరస్వామి మాజీ ఎంపీపీ పరిటాల భాగ్యలక్ష్మి మాజీ ఎం సి చైర్మన్ నన్నపనేని లక్ష్మీనారాయణ ఆర్ ఎస్ ప్రసాద్ గుర్రం రామకృష్ణ తాడపనేని లక్ష్మణరావు గుత్త ఓంకార్ టౌన్ పార్టీ అధ్యక్షులు వేమా వెంకట్రావుగొట్టుముక్కల పేరకలపాడు సర్పంచులు రాజ్ కుమార్ మన్నే సాత్విక మండల బీసీ సెల్ అధ్యక్షులు కంచె రమేష్ డాక్టర్ వీరస్వామి తోట దుర్గారావు నాయుడు శ్రీనివాసరావు నాయుడు విజయ్ తాళ్లూరు సత్యం పరిటాల శివకుమార్ తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

## 28 వ వారం పూర్తి అయిన అన్నసంతర్పణ కార్యక్రమం



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** 28 వ వారం అన్నసంతర్పణ కార్యక్రమం ముగిసింది. ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మను ఆదర్శంగా తీసుకుని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు ప్రతి శనివారం వంతెన సెంటర్‌లోని పెట్రోల్ బంక్ వద్ద గరికిపాటి రామ్, వివేక్, మిత్ర బృందం ఆధ్వర్యంలో అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అన్నసంతర్పణ కార్యక్రమంలో భాగంగా జనసేన మండల పార్టీ అధ్యక్షులు గుడివాక శేషుబాబు ఆర్థిక సహకారంతో అన్నదానం నిర్వహించగా 250 మంది నిరుపేదలు అన్నసంతర్పణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాక శేషుబాబు స్వయంగా నిరుపేదలకు అన్నప్రసాదాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.టి.సి బొప్పన బాణ, తోట ఆంజనేయులు, గుడివాక రామాంజనేయులు, తుంగల నరేష్‌లతో పాటు పలువురు జనసైనికులు వారి సేవలందించారు.

## కొచ్చిన్ ఆంధ్ర కళాసమితి సేవలు అద్భుతం



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణకు కొచ్చిన్ ఆంధ్ర కళాసమితి గత 60 సంవత్సరాలుగా చేస్తున్న కృషి అభినందనీయం అని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శనివారం కొచ్చిన్‌లో ఆంధ్రా కల్చరల్ అసోసియేషన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేరళలో భారీ వరదల్లో నష్టపోయిన బాధితులకు దివిసీమ విద్యాసంస్థలు సేకరించి ఇచ్చిన నిధులతో సహాయ కార్యక్రమాలు చేయడమే కాకుండా గృహ నిర్మాణాలు కూడా నిర్వహించినందుకు అభినందనలు తెలిపారు. ఇటీవల దివిసీమలో భారీ వర్షాలకు నష్టపోయి ఆత్మహత్యాయత్నం చేసిన ఇరువురి రైతులకు ఒకొక్కరికి రూ.25 వేల చొప్పున రూ.50 వేలు సహాయం చేసినందుకు వారికి మండలి కృతజ్ఞతలు తెలియచేశారు. సమితి అధ్యక్షులు ఎం హరి హర నాయుడు, రాష్ట్రేతర తెలుగు వారికి బుద్ధప్రసాద్ ఆత్మ బంధువు అని తెలుగు వారి కష్ట సుఖాలు తెలుసుకుని తెలుగు సంస్థలను ప్రోత్సహించే ఏకైక నాయకుడు మండలి అని అన్నారు. ఈ సమావేశంలో సమితి కార్యదర్శి సత్యనారాయణ చోడే, కోశాధికారి ప్రసాద్, మహిళా విభాగం కో ఆర్డినేటర్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

## 24న హుండీ లెక్కింపు

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** ఈ నెల 24వ తేదీ బుధవారం ఉదయం హుండీల లెక్కింపు జరుగుతుందని ఆలయ కార్యనిర్వాహణాధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని పులిగడ్డ గ్రామంలో వేంచేసి ఉన్న వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలోని హుండీలు 12 గంటలకు అవనిగడ్డ గ్రామదేవతగా పూజలు అందుకుంటున్న ఆలయంలోని హుండీలను దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో హుండీ లెక్కింపు జరుగుతుందని దేవాలయాల కార్యనిర్వాహణాధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆశక్తి గలవారు డ్రస్ కోడ్ పాటిస్తూ లెక్కింపులో పాల్గొనవచ్చన్నారు.

## యజ్ఞ యాగాదులకు,ఆరాధనకు వినియోగం



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** జై శంకర హరహర శంకర శ్రీ శ్రీ కంచి కామకోటి పీఠాధీశ్వరులు శ్రీ శ్రీ చంద్ర శేఖరేంద్ర, సరస్వతి మహా స్వామి ఆదేశానుసారం కామకోటి భక్త బృందం శనివారం మధ్యాహ్నం ఉంచవృత్తికి వేంచేసినారు. యావన్ మంది భక్త బృందం వారికి ధన, కనక, వస్తు రూపేనా ద్రవ్యాన్ని అందచేయగా ఇది పీఠానికి అందచేస్తారు. ఈ ఉంచవృత్తిలో ప్రజలు స్వయం పాకంగా పప్పులు, ఉప్పు, బియ్యం, బెల్లం, నెయ్యి, నూనె, వస్త్రాలు అందచేయగా భక్తులు, ప్రజలు ఇచ్చినటువంటి ద్రవ్యాన్ని వారు పీఠంలో జరిగే యజ్ఞ యాగాదులకు చంద్రమోళేశ్వర ఆరాధనకు వినియోగిస్తారన్నారు. గత 15 సంవత్సరాల నుండి విజయవాడలోని కృష్ణలంకలో గుంటూరు శ్రీరామచంద్రమూర్తి, సోమయాజుల ఆధ్వర్యంలో కామకోటి నగరలో బ్రహ్మశ్రీ వేదమూర్తులు కప్పగంతు రామలింగగణపాటి ఆధ్వర్యంలో రామలింగేశ్వర పేటలో పెద్దభట్ల విష్ణు భార్గవి, కొత్తపల్లి దత్తాత్రేయ శర్మల ఆధ్వర్యంలో ఉంచవృత్తి కొనసాగింది. ఈ సేవలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారి కృపాకటాక్షాలు పొందారు.



## వికసిత్ భారత్ సంకల్పయాత్ర

**నందిగామ, జనవరి 20, మేజర్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న "వికసిత్ భారత్ సంకల్ప యాత్ర" కార్యక్రమమును శనివారం నందిగామ పురపాలక సంఘ పట్టణ పరిధిలో గల గాంధీ సెంటర్‌లో నిర్వహించారు. సదరు కార్యక్రమములో కేంద్ర ప్రభుత్వ పథకాల యొక్క ఆవశ్యకతను వివరించారు. పథకాల ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారులకు ఆయుష్ మాన్ భారత్ హెల్త్ కార్డులు పంపిణీ చేసి, స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమమునకు మున్సిపల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఫణి శ్రీనివాసరావు, మెడికల్ ఆఫీసర్లు, ఐ.సి.డి.సి. సిబ్బంది, కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది - వాలంటీర్లు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ తోటకు అభినందనల వెల్లువ



**గన్నవరం, జనవరి 20, మేజర్ న్యూస్ :** గన్నవరం మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన తోట కరుణ వెంకయ్యను శనివారం వారి స్వగృహానికి వైఎస్ఆర్ కాంతి పథకం ఏపీఎం టి మాధవి, గన్నవరం సిసి డి రాణి, వి ఓ ఏలు విచ్చేసి దుస్సాల్వాతో సత్కరించి, పుష్పగుచ్ఛము అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కరుణ వెంకయ్య మాట్లాడుతూ.. తనకు ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వహించి సీఎం జగన్మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే వంశీలకు మంచి పేరు తెస్తానని తెలిపారు.

## తానా నూతన సంయుక్త కార్యదర్శిగా చెవిటికల్లు వాసి



**కంచికచర్ల జనవరి 20 మేజర్ న్యూస్ :** తానా నూతన సంయుక్త కార్యదర్శిగా వెంకట్ కోగంటి ఎన్నిక కావడం ఎన్టీఆర్ జిల్లాకే గర్వకారణం అని పలువురు అభినందించారు. కంచికచర్ల మండలం చెవిటికల్లు గ్రామానికి చెందిన వెంకట్ కోగంటి ఇటీవల అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరిగిన తానా ఎన్నికల్లో సంయుక్త కార్యదర్శిగా అత్యంత భారీ మెజారిటీతో గెలుపొందారు అతనిని దేశం పార్టీ నాయకులు గ్రామస్తులు పలువురు అభినందించారు

## కంచర్ల ద్విగున్ భాస్కర్ జన్మదిన సందర్భంగా అన్నా క్యాంటీన్



**నందిగామ, జనవరి 10, మేజర్ న్యూస్:** టిడిపి సీనియర్ నాయకులు కంచర్ల వెంకట రాంబాబు (కేబుల్ రాము) ద్వితీయ కుమారుడు కెనడాలో సాఫ్ట్వేర్ జాబ్ చేస్తున్న ద్విగున్ భాస్కర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ సెంటర్లో 449 వ రోజు నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్న వితరణ కార్యక్రమం ప్రథమ కుమారుడు హరి భాస్కర్ పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న తెలుగుదేశం నాయకులు, అన్న క్యాంటీన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## రాస్తారోకో నిర్వహించిన అంగన్వాడి వర్కర్స్



**నందిగామ, జనవరి 20, మేజర్ న్యూస్:** పట్టణం స్థానిక రైతుపేట, ఆవరణలోఎన్ హెచ్ 65 రోడ్డు పై అంగన్వాడి టీచర్లు బైఠాయించారు.రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న అంగన్వాడీల నిరవధిక దీక్ష 40వ రోజు ఉద్రిక్త వాతావరణం లో కొనసాగింది, పోలీసులకి అంగన్వాడీ టీచర్లకు మధ్య చాలా వరకు, తోపులాట సంభవించింది, అంగన్వాడీలు రాస్తారోకో చేస్తామంటూ రోడ్డుపై బైటాయించి, వాళ్ల సమస్యను వెంటనే పరిష్కరించాలని నినాదాలతో హోరెత్తిచ్చి, నేషనల్ హైవే పైన పరుగులు పెట్టడంతో పోలీసులు దిక్కుతోచని స్థితిలో వాళ్ల వెంట పరిగెత్తి, వెంటనే కంట్రోల్ చేసి, అక్కడున్నటువంటి అంగన్వాడీ టీచర్లు అందర్నీ, నిరాహా ర దీక్ష శిబిరానికి తరలించారు. అందులో భాగంగా పోలీసులు ముందస్తు చర్యలో భాగంగా, హైదరాబాద్ టు విజయవాడ వెళ్లే రహదారిలో ఎక్కడ కూడా ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా, ఏ రకమైన ఇబ్బందికరమైనటువంటి క్షణాలు కలగకుండా బస్సులు వాహనాలు కార్లు ప్రయాణికులకు ఏ రకమైనటువంటి ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలో భాగంగా ట్రాఫిక్ డైవర్షన్ చేసిన నందిగామ పట్టణ సిఐ హనీష్, ఎస్సై పండు దొర ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు.

## శ్రీ అయోధ్య నుండి వచ్చిన అక్షింతలు ఇంటింటికి పంపిణీ



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** చిట్టిపాలెం గ్రామంలో శ్రీ అయోధ్య నుండి వచ్చిన అక్షింతలు ఇంటింటికి పంపిణీ కార్యక్రమం నిర్వహణ. ఈ కార్యక్రమంలో విశ్వహిందు పరిషత్ సభ్యులు చిట్టిపాలెం గ్రామ మహిళలు, గ్రామస్తులు మాజీ సర్పంచ్ రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.